http://www.agnidharanews.com

# అగ్నిధార

నిజాల నిప్పు కణిక

మంగళవారం 19 నవంబర్ 2024

పేజీలు : 5 వెల : 5/-

Published from Peddapalli Ciculated by Hyderabad, , , Sangareddy, jagityala, Rangareddy, Khammam,Medchal Medak Siddipet, Nalgonda, , warangal, Nizamabad




# జిల్లాల పర్యటనలకు సీఎం ప్లాన్



- ఈనెల 19 నుంచి వచ్చే నెల 9వ తారీఖు వరకు పలు జిల్లాల్లో పర్యటించేలా షెడ్యూల్ ఖరారు
- డిసెంబర్ 7 వరకు ఏడాది పూర్తవుతున్న సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి జిల్లాల పర్యటనకు శ్రీకారం
- 19న వరంగల్ లో మహిళ సదస్సు పేరుతో సీఎంతోపాటు మంత్రులందరు పర్యటిస్తారు
- ఆ మరుసటి రోజు 20న రాజన్న సిరిసిల్ల జిల్లాలో సీఎం పర్యటిస్తారు
- సిరిసిల్లలో ఎస్పీ కార్యాలయం ప్రారంభించడంతో వేములవాడ రాజన్నను దర్శించుకుని ఆలయ అభివృద్ధి తోపాటు రోడ్డు వెడల్పు పనులకు శంకుస్థాపన

హైదరాబాద్

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలనపై సీఎం రేవంత్ రెడ్డి జిల్లాల పర్యటనకు సిద్ధమయ్యారు. ఏడాది కాలంలో చేసిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను వివరించనున్నారు . ఈనెల 19 నుంచి వచ్చే నెల 9వ తారీఖు వరకు పలు జిల్లాల్లో పర్యటించేలా షెడ్యూల్ ఖరారు చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరి డిసెంబర్ 7 వరకు ఏడాది పూర్తవుతున్న సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి జిల్లాల పర్యటనకు శ్రీకారం చుడుతున్నారు. మంత్రివర్గ సభ్యులతో పాటు సీఎం ఉన్నతాధికారులతో కలిసి పర్యటించాలని నిర్ణయించారు. 19న వరంగల్ నుంచి ప్రారంభమయ్యే సీఎం జిల్లాల టూర్ డిసెంబర్ 9 వరకు సాగనుంది. - మిగతా3లో



## మణిపూర్‌కు మరో 50 సీఆర్‌పీఎఫ్ కంపెనీలు

- ఈశాన్య రాష్ట్రంలో తీవ్ర ఉద్రిక్తతలు
- రాష్ట్రంలో భద్రతను మరింత పటిష్టం చేయాలని హోం శాఖ నిర్ణయం
- శాంతి భద్రతల పరిరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సీఆర్‌పీఎఫ్, రాష్ట్ర పోలీసు అధికారులకు ఆదేశాలు
- మణిపూర్‌కు అదనంగా 50 కంపెనీల సీఆర్‌పీఎఫ్ బలగాలను పంపించాలని కేంద్రం నిర్ణయం



## తెలంగాణ సమాజం దిగజారుడు రాజకీయాలను సహించదు

- బీజేపీ అంటే ఏంటో రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి చూపిస్తాం
- రాజకీయాలంటే అసహ్యం కలిగేలా ఈ రెండు పార్టీల తీరు
- బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల వల్ల రాజకీయాలు దిగాజారిపోయాయి
- కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి

హైదరాబాద్

కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల వల్ల రాజకీయాలు దిగాజారిపోయాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం హైదరాబాద్‌లో ఆయన ఏబీఎన్ ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ... రాజకీయాలంటే అసహ్యం కలిగేలా ఈ రెండు పార్టీల తీరు ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. అయితే తెలంగాణ సమాజం దిగజారుడు రాజకీయాలను సహించదని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. గతంలో బీఆర్ఎస్ పాలన ఎలా ఉందో.. ప్రస్తుతం కాంగ్రెస్ పాలన అలానే ఉందన్నారు. బీఆర్ఎస్, బీజేపీలు ఒకటేనంటూ చేసిన వ్యాఖ్యలపై మంత్రి కిషన్ రెడ్డి మండిపడ్డారు. పదేళ్లు అధికారంలో ఉన్న వాళ్లకు సహకారం అందించిన వాళ్లు ఎవరంటూ ఆయన వ్యంగ్యంగా ప్రశ్నించారు. తనపై ఆరోపణలు చేస్తున్న వారి - మిగతా3లో

## తెలంగాణలో నిజాం రాజ్యాంగం అమలవుతోంది



- ప్రశ్నిస్తే సంకెళ్లు... నిలదీస్తే అరెస్టులు అంటూ కేటీఆర్ ఆగ్రహం
- విచారణకు రమ్మని పిలిచి అరెస్ట్ చేయడమేమిటని ప్రశ్న
- అక్రమ అరెస్టులతో ఎన్నాళ్లు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తారని నిలదీత

తెలంగాణలో నియంతలు రాజ్యమేలుతున్నారని, నిజాం రాజ్యాంగం అమలవుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు గుప్పించారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. "ప్రశ్నిస్తే సంకెళ్లు... నిలదీస్తే అరెస్టులు... నియంత రాజ్యమిది... నిజాం రాజ్యాంగమిది" అంటూ రాసుకొచ్చారు. కాంగ్రెస్ వైఫల్యాలను ఎత్తిచూపినందుకే కొణతం దిలీప్ గారిని అరెస్ట్ చేశారని ఆరోపించారు. విచారణకు రమ్మని పిలిచి అక్రమంగా అరెస్ట్ చేస్తారా? అంటూ ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. అక్రమ అరెస్టులతో ఎన్నాళ్లు - మిగతా3లో

## కాంగ్రెస్ పార్టీలో ఉన్న స్వేచ్ఛ ఏ పార్టీలో లేదు



- బీజేపీ, బీఆర్ఎస్ కుమ్మక్కై కాంగ్రెస్ పార్టీపై కుట్ర
- హరీష్ రావుకి పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సవాల్..
- కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు కొంత నారాజ్ ఉన్నారు
- కార్యకర్త కూడా సీఎంను కలిసే వెసులుబాటు కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉంది

# మళ్లీ.. హైడ్రా దూకుడు

- అక్రమ నిర్మాణాలపై హైడ్రా ఉక్కుపాదం..
- సంగారెడ్డిలో కూల్చివేతలు
- నగర శివారు ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలపై హైడ్రా ఫోకస్
- ముందుగానే హైడ్రా అధికారులు నోటీసులు ఇచ్చి 15 రోజులు గడువు ఇస్తున్నారు
- రెండు వారాల్లో నిర్మాణాలను యజమానులే ఆక్రమణలు తొలగించకపోతే హైడ్రా రంగంలోకి దిగనుంది.



సంగారెడ్డి

ఆక్రమణలు చేసిన అక్రమార్కుల పాలిట ఉక్కుపాదం మోపుతున్న హైడ్రా సోమవార మరిన్ని కూల్చివేతలు చేపట్టింది. హైడ్రా మళ్లీ దూకుడు పెంచింది. నగర శివారు ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలపై హైడ్రా ఫోకస్ పెట్టింది. అమీన్ పూర్ వందనపురి కాలనీలో 848 సర్వే నంబర్‌లో అక్రమ నిర్మాణంపై కొరడా ఝుళిపించింది. రోడ్డును ఆక్రమించి నిర్మించిన భవనాన్ని కూల్చివేశారు. నోటీస్ ఇచ్చినప్పటికీ ఇళ్లను తొలగించకపోవడంతో హైడ్రా సీరియస్ అయింది. భారీ యం త్రాలతో అక్రమ నిర్మాణాన్ని హైడ్రా సిబ్బంది కూల్చివేస్తున్నారు. అమీన్ పూర్ మున్సిపాలిటీ పరిధిలో ఈరోజు హైడ్రా అధికా రులు కూల్చివేతలు చేపట్టారు. వందనపురి కాలనీలో 848 సర్వే నంబర్‌లో అక్రమ నిర్మాణంపై కొరడా ఝుళిపించారు. కొంత మంది రోడ్డును ఆక్రమించి ఇంటి నిర్మాణం చేపట్టారు. భారీ యంత్రాలతో రంగంలోకి దిగిన హైడ్రా అధికారులు వాటిని కూల్చివేస్తున్నారు. అమీన్ పూర్‌లోని - మిగతా3లో

## నెలన్నరలో 2,234 ఓవరేజ్ వాహనాలు సీజ్

- నేషనల్ క్యాపిటల్ రీజియన్ పరిధిలో కాలుష్యాన్ని తగ్గించేందుకు ఈ నిర్ణయం
- గత కొద్ది రోజులుగా ఢిల్లీ-ఎన్‌సిఆర్‌లో గ్రేడెడ్ రెస్పాన్ యాక్షన్ ప్లాన్
- మూడు, నాల్గో దశలను ప్రభుత్వం అమలు
- ఓవరేజ్ వాహనాల్లో పదేళ్లకుపైగా 260 డీజిల్ ఫోర్ వీలర్లు ఉన్నాయి



## దేశంలోనే మహారాష్ట్ర ధనిక రాష్ట్రం

- రాష్ట్రాల జీఎస్ డీపీని లెక్కగట్టిన కేంద్ర ప్రభుత్వం
- అత్యధిక స్థూల జాతీయోత్పత్తితో టాప్‌లో ఉన్న మహారాష్ట్ర
- చివరి నుంచి రెండు వరుసలో తెలుగు రాష్ట్రాలు
- ఇటీవల గణాంకాలు విడుదల చేసిన ప్రధాన మంత్రి ఆర్థిక సలహా మండలి

# మణిపూర్‌కు మరో 50 సీఆర్‌పీఎఫ్ కంపెనీలు

న్యూఢిల్లీ: మణిపూర్‌లో మళ్లీ హింసాకాండ ప్రజ్వరిల్లడంతో అక్కడి పరిస్థితిపై కేంద్ర హోం మంత్రి అమిత్‌షా రెండో రోజైన సోమవారంనాడు కూడా అత్యున్నత స్థాయి భద్రతా సమావేశంలో సమీక్షిమించారు. ఈశాన్య రాష్ట్రంలో ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరుతుండంతో రాష్ట్రంలో భద్రతను మరింత పటిష్టం చేయాలని హోం శాఖ నిర్ణయించింది. ప్రస్తుతం ఉన్న భద్రతా పరిస్థితిని అమిత్‌షా సమీక్షించడంతో పాటు, ఎలాంటి పరిస్థితుల్లోనూ శాంతి భద్రతల పరిరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సీఆర్‌పీఎఫ్, రాష్ట్ర పోలీసు అధికారులకు ఆదేశాలిచ్చారు.

**అదనంగా 50 కంపెనీల సీఆర్‌పీఎఫ్ బలగాలు**

మణిపూర్‌కు అదనంగా 50 కంపెనీల సీఆర్‌పీఎఫ్ బలగాలను పంపించాలని కేంద్రం నిర్ణయించింది. ప్రస్తుతం 20 కంపెనీల సీఆర్‌పీఎఫ్ బలగాలు రాష్ట్రంలో మోహరించగా, తాజా నిర్ణయంతో 70 కంపెనీల సీఆర్‌పీఎఫ్ బలగాలు రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణ బాధ్యతను తీసుకుంటాయి.

**ఆరుగురి ఊచకోతతో..**

గత ఏడాది మణిపూర్‌లో చెలరేగిన జాతుల ఘర్షణలో 200 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా, వేలాది మంది నిరాశ్రయులయ్యారు. పరిస్థితి నివురుగప్పిన నిప్పులా ఉన్న తరుణంలో గత శనివారంనాడు తిరిగి హింసాకాండ చెలరేగింది. సాయుధ మిలిటెంట్లు ఆరుగురు గ్రామస్థులను కిడ్నాప్ చేసి ఊచకోత కోసి చంపడంతో ఒక్కసారిగా ఆందోళనలు పెల్లుబికాయి. నిరసనకారులు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేల ఇళ్లపై దాడులు చేసి, వాహనాలను తగులబెట్టారు.




సీఎం బీరేంద్ర సింగ్ ఇంటిపై కూడా దాడికి విఫలయత్నం చేశారు. నిరసనలు, ఆందోళనలను అదుపు చేసే క్రమంలో భద్రతా బలగాలు జరిపిన కాల్పుల్లో జిరిబాం జిల్లాకు చెందిన 20 ఏళ్ల యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. ఆందోళనకారులు స్థానిక బీజేపీ, కాంగ్రెస్ కార్యాలయాల్లోకి చొరబడి ఆస్తుల విధ్వంసానికి పాల్పడ్డారు. ఫర్నిచర్‌ను దగ్ధం చేశారు. మణిపూర్‌లో సంక్షోభం ముదురుతుండటంతో శాంతిభద్రత వైఫల్యానికి నిరసగా బీజేపీ సారథ్యంలోని బీరేంద్ర సింగ్ ప్రభుత్వానికి నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్‌పీపీ) మద్దతును ఉపసంహరించుకుంది.

**మూడు కేసుల దర్యాప్తు ఎన్ఐఏకు..**

కేంద్ర హోం శాఖ ఆదేశాల మేరకు ఇటీవల మణిపూర్‌లో చెలరేగిన హింసాకాండకు సంబంధించిన మూడు కేసుల దర్యాప్తు బాధ్యతను నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఏ) చేపట్టింది. వీటిలో కుకీ ఉగ్రవాదులకు, సీఆర్‌పీఎఫ్‌కు మధ్య ఇటీవల జరిగిన కాల్పులకు సంబంధించిన కేసు కూడా ఉంది. ఈ ఎన్‌కౌంటర్‌లో 11 మంది కుకీ ఉగ్రవాదులను బలగాలు మట్టుబెట్టాయి.

**మణిపూర్‌లో కొనసాగుతున్న ఉద్రిక్తతలు.. కాల్పుల్లో ఒకరు మృతి**

**ఇంఫాల్:** మణిపూర్‌లో ఉద్రికత్తలు కొనసాగుతున్నాయి. హింసాత్మకమైన జిరిబామ్ జిల్లాలో భద్రతా బలగాలు, నిరసనకారుల మధ్య ఘర్షణ జరిగింది. ఈ సందర్భంగా జరిగిన కాల్పుల్లో ఒక నిరసనకారుడు మరణించాడు. ఆదివారం రాత్రి పలువురు నేతల ఆస్తులు, పార్టీ కార్యాలయాలపై ఆందోళనకారులు దాడులు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన అల్లర్లలో 21 ఏళ్ల అథౌబా చనిపోయినట్లు చెప్పారు. అయితే అతడిపై ఎవరు కాల్పులు జరిపారో అన్నది పోలీసులు స్పష్టం చేయలేదు. %కాగా, నిరసనకారుల గుంపును చెదరగొట్టేందుకు పోలీస్ ప్రత్యేక కమాండోలు ఆయుధాలు ప్రయోగించినట్లు జనం ఆరోపించారు. ఈ కాల్పుల్లో అథౌబా మరణించగా మరో ఇద్దరు గాయపడ్డారని నిరసనకారులు తెలిపారు. మరోవైపు మహిళలు, పిల్లలను కుకీ మిలిటెంట్లు హత్య చేయడంపై మణిపూర్‌లో నిరసనలు, హింసాత్మక సంఘటనలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో స్కూళ్లు, కాలేజీలకు రెండు రోజులు సెలవు ప్రకటించారు. ఇంఫాల్ పశ్చిమ, తూర్పు జిల్లాల్లోని యూనివర్సిటీలు, కాలేజీలతో సహా అన్ని ప్రభుత్వ విద్యా సంస్థలను మంగళవారం వరకు మూసివేస్తున్నట్లు ప్రభుత్వం సోమవారం ప్రకటించింది.

# అదానీ ప్రయోజనాల కోసమే బీజేపీ 'ఏక్ హై తో సేఫ్ హై' నినాదం

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 'ఏక్ హై తో సేఫ్ హై' నినాదంపై కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ విమర్శలు ఎక్కుపెట్టారు. మహారాష్ట్ర ప్రయోజనాల కంటే బిజినెస్ టైకూన్ గౌతమ్ అదానీ ప్రయోజనాలే ఆయనకు ముఖ్యమని అన్నారు. నవంబర్ 20న మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సోమవారంనాడిక్కడ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాహుల్ మాట్లాడారు. తన వాదనకు బలం చేకూర్చే రెండు పోస్టర్లను ఆయన ప్రదర్శించారు. మొదటి ఫోటోలో ప్రధాని మోదీ, అదానీ ఉన్నారు. దానిపై 'ఏక్ హై తో సేఫ్ హై' అనే క్యాప్షన్ ఉంది. ఒకరితో ఒకరు కలిసి ఉన్నంత వరకూ వారిద్దరూ సేఫ్‌గా ఉంటారని రాహుల్ ఈ ఫోటోపై వ్యాఖ్యానించారు. రెండో ఫోటోలో అదానీ గ్రూప్ వివాదాస్పద ధారవి రీడవలప్‌మెంట్ ప్రాజెక్టుకు సంబంధించినది. సురక్షితంగా(సేఫ్) ఉండటం అంటే ముంబై సంపదకు సంబంధించిన విషయమని, బీజేపీ సారథ్యంలోని ప్రభుత్వం మద్దతుతో ఆ సంపదను అదానీ టార్గెట్ చేసుకున్నారని ఆరోపించారు. రాజకీయ యంత్రాగం యావత్తు ధారవి రీడవలప్‌మెంట్ ప్రాజెక్టును ఒకే వ్యక్తికి (అదానీ) కట్టబెట్టాలనుకుంటోందని అన్నారు. ధారవి రీడవలప్‌మెంట్ ప్రాజెక్టు అసంబద్ధమైన రీతిలో ఒక వ్యక్తికే ప్రయోజనం చేకూర్చిపెట్టేందుకు జరుగుతున్న ప్రయత్నమని,




టెండర్ల విధానంతో తాము ఏకీభవించడం లేదని, దేశంలోని అన్ని నౌకాశ్రయాలు, విమానాశ్రయాలు, దేశ సంపద ఒకే వ్యక్తికి కట్టబెడుతున్నారని రాహుల్ విమర్శించారు.

**టెండర్ రద్దు హామీకి కట్టుబడి ఉంటాం..**

'మహా వికాస్ అఘాడి' కూటమి అధికారంలోకి రాగానే ధారవి ప్రాజెక్టు టెండర్‌ను రద్దు చేస్తామంటూ ఉద్ధవ్ థాకరే చేసిన వాగ్దానానికి తాము కట్టుబడి ఉంటామని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. మహారాష్ట్ర నుంచి కీలక పారిశ్రామిక ప్రాజెక్టులను గుజరాత్‌కు తరలించుకుపోయారని కూడా ఆయన ఆరోపించారు. రాష్ట్ర ఆర్థిక అవకాశాలకు ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే గండికొట్టారని అన్నారు. ఫాక్స్‌కాన్, ఎయిర్‌బస్ వంటి రూ.7 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులను గుజరాత్‌కు తరలించారని, మహారాష్ట్రకు రావాల్సిన 5 లక్షల ఉద్యోగాలను కోల్పోయేలా చేశారని రాహుల్ ఘాటుగా విమర్శించారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు రెండు సిద్ధాంతాలకు సంబంధించిన పోరాటమని, ఒక బిలియనీర్‌కు, పేదలకు మధ్య జరుగుతున్న పోరాటమని రాహుల్ అన్నారు. మహారాష్ట్ర ప్రజల ప్రయోజనాలకే కాంగ్రెస్ సారథ్యంలోని సారథ్యంలోని ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తుందని ఆయన స్పష్టం చేశారు.


**ఏమిటీ ధారవీ ప్రాజెక్టు**

సెంట్రల్ ముంబైలోని 600 ఎకరాల ప్రైమ్ ల్యాండ్‌కు సంబంధించిన ప్రాజెక్టు ఈ ధారవి డవలప్‌మెంట్ ప్రాజెక్టు. మహారాష్ట్ర ఎన్నికల్లో కీలకాంశంగా కూడా ఉంది. బీజేపీ సారథ్యంలోని మహాయుతి ప్రభుత్వం హయాంలో 2022లో ఈ రీడవలప్‌మెంట్ బిడ్‌ను అదానీ గ్రూప్ దక్కించుకుంది. అయితే కాంట్రాక్టు కేటాయింపులో పారదర్శకత లోపించిందంటూ విపక్షాలు ఈ నిర్ణయంపై ఆందోళన వక్తం చేశాయి. కాగా, స్లమ్ ప్రాంత వాసుల జీవన స్థితగతులు, మౌలిక వసతుల కల్పనకు దోహదపడే పడే ప్రాజెక్టు ఇదని బీజేపీ సమర్థిస్తోంది.

# ఢిల్లీలో బీజేపీ ఆపరేషన్... ఆప్ వికెట్లు డౌన్

**న్యూఢిల్లీ :** ఢిల్లీ మంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకుడు కైలాష్ గెహ్లాట్ రాజీనామా చేశారు. ఈ మరేకు పార్టీ అధినేతఅరవింద్ కేజ్రీవాల్‌కు రాసిన లేఖలో తన రాజీనామాకు కారణాలు వివరించారు. ఇందులో కీలక ఆరోపణలు చేశారు. పార్టీ స్థాపించినప్పటి విలువలకు ఇప్పుడు జరుగుతున్న పరిణామాలకు చాలా వ్యత్యాసం ఉందని అభిప్రాయపడ్డారు. అందర్నీ ఏకం చేసిన విలువ నుంచి పార్టీ దూరమై సవాళ్లు ఎదుర్కొంటోందని అన్నారు. ప్రజల పట్ల పార్టీ నిబద్ధతను రాజకీయ ఆశయాలు అధిగమించాయని అన్నారు గెహ్లాట్. ఫలితంగా చాలా వాగ్దానాలు నెరవేరకుండా మిగిలిపోయాయని అన్నారు. యమునా నదిలో కాలుష్యం సమస్య, కేజ్రీవాల్ నివాసం పునరుద్ధరణలో అవకతవకలు, అంతర్గత విభేదాలు పార్టీని వీడటానికి కారణాలని ఆయన ప్రస్తావించారు."ఉదాహరణకు యమునా నదిని తీసుకోండి, ఇది స్వచ్ఛమైన నదిగా రూపాంతరం చెందుతుందని మేము వాగ్దానం చేసాం, కానీ ఆ పని చేయడానికి ఎప్పుడూ ముందుకు రాలేదు. ఇప్పుడు యమునా నది బహుశా గతంలో కంటే మరింత కలుషితమైంది," అని చెప్పారు, ఇప్పుడు 'షీష్మహల్' వంటి చాలా ఇబ్బందికరమైన వివాదాలు చుట్టుముడుతున్నాయి. ఇప్పుడు మేము ఆమ్ ఆద్మీ పార్టీలో ఉన్నామా అనే అనుమానం చాలా మందికి కలుగుతోంది," అన్నారాయన.

"ఢిల్లీ ప్రజలకు ప్రాథమిక సేవలను అందించడంలో మా సామర్థ్యాన్ని తీవ్రంగా దెబ్బతీసింది. ఢిల్లీ ప్రభుత్వం కేంద్రంతో పోరాడటానికి ఎక్కువ సమయం వెచ్చిస్తే ఢిల్లీకి నిజమైన పురోగతి జరగదని ఇప్పుడు స్పష్టంగా తెలుస్తుంది" అని గెహ్లాట్ లేఖలో పేర్కొన్నారు. . ఈ పరిణామంపై స్పందించిన భారతీయ జనతా పార్టీ ఢిల్లీ చీఫ్ వీరేంద్ర సచ్‌దేవా... గెహ్లాట్



చాలా సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారని కొనియాడారు. కేజ్రీవాల్‌కు గెహ్లాట్ అద్దం చూపించారన్నారు.ఏడాది ఫిబ్రవరిలో ఢిల్లీ శాసనసభకు ఎన్నికలు జరగనున్న వేళ గెహ్లాట్ రాజీనామా ఆమ్ ఆద్మీ పార్టీకి ఎదురుదెబ్బగా భావించవచ్చు. రవాణా, పరిపాలనా సంస్కరణలు, ఐ, గృహం, స్త్రీడ శిశు సంక్షేమ శాఖలు నిర్వహిస్తున్నారు. ఢిల్లీలో వచ్చే ఫిబ్రవరిలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ తరుణంలో రాజకీయ మార్పులు ప్రారంభమయ్యాయి. మొన్నీ మధ్య జైలు నుంచి విడుదలైన కేజ్రీవాల్ తను రాజీనామా చేసి తన పార్టీ నేత అతిషీని ఢిల్లీ సీఎంగా కూర్చోబెట్టారు. మద్యం పాలసీలో అక్రమాల నుంచి అనేక ఆరోపణలు ఆప్‌ఆద్మీ ప్రభుత్వం మెడకు చుట్టుకుంటున్నాయి. ప్రచారంలో ఉన్న ఆరోపణలే అస్త్రంగా మలుచుకునేందుకు ప్రత్యర్థులు వ్యూహాలకు పదును పెట్టారు. కీలకమైన ఆప్ నేతలను తమ వైపు లాక్కునేందుకు బీజేపీ పావులు కదుపుతోంది. అందులో భాగంగానే గెహ్లాట్‌తో రాజీనామా చేయించినట్టు స్పష్టం అవుతుంది. ఆయన రాజీనామా చేశాడో లేదే బీజేపీ కూడా ఆయనకు పాజిటివ్‌గా స్పందించింది. దీంతో ఆయన రాజీనామా వెనకాల ఉన్నది ఎవరో స్పష్టమైందని ఆప్ విమర్శిస్తోంది.

## నెలన్నరలో 2,234 ఓవరేజ్ వాహనాలు సీజ్



దేశ రాజధాని ఢిల్లీలో అక్టోబర్ ఒకటి నుంచి నవంబర్ 15 మధ్య రవాణాశాఖ 2,234 ఓవరేజ్ వాహనాలను సీజ్ చేసింది. నేషనల్ క్యాపిటల్ రీజియన్ పరిధిలో కాలుష్యాన్ని తగ్గించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నది. గత కొద్ది రోజులుగా ఢిల్లీ-ఎన్‌సిఆర్‌లో గ్రేడెడ్ రెస్పాన్ యాక్షన్ ప్లాన్ మూడు, నాల్గో దశలను ప్రభుత్వం అమలు చేస్తున్నది. చేసిన ఓవరేజ్ వాహనాల్లో పదేళ్లకుపైగా 260 డీజిల్ ఫోర్ వీలర్లు ఉన్నాయని ఢిల్లీ రవాణా శాఖ పేర్కొంది. 15 ఏళ్లు పైబడిన 1,156 పెట్రోల్ ద్విచక్ర వాహనాలు, 818 పెట్రోల్ త్రీవీలర్స్, ఫోర్ వీలర్స్ సీజ్ చేసినట్లు చెప్పింది. ఈ డ్రైవ్ డిసెంబర్ వరకు కొనసాగుతుందని.. పర్యావరణ నిబంధనలను అమలు చేయడానికి, వాహనాల నుంచి వెలువడే ఉద్గారాలను తగ్గించే ప్రయత్నంలో భాగమని ఢిల్లీ రవాణా శాఖ పేర్కొంది. ఓవరేజ్ వాహనాలపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు ఢిల్లీ రవాణాశాఖ పోర్టల్‌ని ప్రారంభించింది. స్వాధీనం చేసుకున్న వాహనాలను స్క్రాప్ చేయడం, వెనక్కి తీసుకోవడం, విక్రయించడం సులభతరం చేయడం.. స్క్రాపింగ్ ప్రక్రియను క్రమబద్ధీకరించడానికి, వాహన యజమానులకు అలాంటి వాహనాల నిర్వహణ కోసం స్పష్టమైన స్టాండర్డ్ ఆపరేటింగ్ విధానాన్ని అందించేందుకు ప్లాట్‌ఫారమ్ ప్రారంభించారు. ఇటీవలి ఢిల్లీ హైకోర్టు ఆదేశాల ప్రకారం.. వాహనాలను నిర్వహించేందుకు 2024 మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని ఢిల్లీ రవాణా శాఖ రిజిస్టర్డ్ వెహికల్ స్క్రాపింగ్ ఫెసిలిటీస్‌కి ఆదేశాలు జారీ చేసింది. ఆర్డర్‌ను పాటించకపోతే ప్రోగ్రామ్ నుంచి మినహాయించబడవచ్చని పేర్కొంది. ఢిల్లీలో పది సంవత్సరాల కంటే పాత డీజిల్ వాహనాలు, 15 సంవత్సరాల కంటే పాత పెట్రోల్ వాహనాలపై నిషేధం విధించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో రాజధానిలో ఓవరేజ్ వాహనాలపై డ్రైవర్ నిర్వహిస్తూ వస్తున్నారు. 15 సంవత్సరాల కంటే పాత వాహనాలను బహిరంగ ప్రదేశాల్లో పార్కింగ్ చేయడాన్ని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ సైతం నిషేధించింది. ఇప్పటి వరకు ఢిల్లీ రవాణాశాఖ 55 లక్షలకుపైగా ఓవరేజ్ వాహనాల రిజిస్ట్రేషన్ రద్దు చేసింది.

## దేశంలోనే మహారాష్ట్ర ధనిక రాష్ట్రం

దేశంలో కొన్ని రాష్ట్రాలు అభివృద్ధిలో దూసుకుపోతూ ఉంటాయి. వ్యవసాయం నుంచి భారీ పరిశ్రమల దాకా అన్ని రంగాల్లో ఉత్పత్తి పెరిగిపోతూ ఉంటుంది. ఆయా రాష్ట్రాల భౌగోళిక అనుకూలతలతోపాటు ప్రభుత్వ పరిపాలనా విధానాలు... ఈ అభివృద్ధికి దోహదపడుతుంటాయి. మరి మన దేశంలో 'రాష్ట్ర స్థూల జాతీయోత్పత్తి (జీఎస్ డీపీ)' ఆధారంగా ధనిక రాష్ట్రాలు ఏవో తెలుసా? ఇటీవల ప్రధాన మంత్రి ఆర్థిక సలహా మండలి వెల్లడించిన గణాంకాల ప్రకారం...

**జీఎస్ డీపీలో టాప్ 10 రాష్ట్రాలు ఇవే...**

| రాష్ట్రం | జీఎస్ డీపీ |
|---|---|
| మహారాష్ట్ర | 42.67 లక్షల కోట్లు |
| తమిళనాడు | 31.55 లక్షల కోట్లు |
| కర్ణాటక | 28.09 లక్షల కోట్లు |
| గుజరాత్ | 27.90 లక్షల కోట్లు |
| ఉత్తరప్రదేశ్ | 24.99 లక్షల కోట్లు |
| పశ్చిమ బెంగాల్ | 18.8 లక్షల కోట్లు |
| రాజస్థాన్ | 17.8 లక్షల కోట్లు |
| తెలంగాణ | 16.5 లక్షల కోట్లు |
| ఆంధ్రప్రదేశ్ | 15.89 లక్షల కోట్లు |
| మధ్యప్రదేశ్ | 15.22 లక్షల కోట్లు |

## ఢిల్లీ ఎన్‌సీఆర్‌లో కాలుష్యంపై సుప్రీంకోర్టు కీలక నిర్ణయం..!

### ఏం చర్యలు తీసుకున్నారంటూ సర్కారుపై ప్రశ్నల వర్షం..



ఢిల్లీలో పెరుగుతున్న కాలుష్యంపై సుప్రీంకోర్టు విచారణ జరిపింది. ఢిల్లీ నేషనల్ క్యాపిటల్ రీజియన్‌లో 12వ తరగతి వరకు అన్ని పాఠశాలలను మూసివేయాలని ఆదేశించింది. కాలుష్యం నియంత్రణకు ఎన్‌సీఆర్‌లోని రాష్ట్రాలు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించింది. పెరుగుతున్న కాలుష్యాన్ని అరికట్టేందుకు ఏం చేశారంటూ సర్వోన్నత న్యాయస్థానం ఢిల్లీ ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ (%+=ూ్రా%) అమలు చేయకపోవడంపై సుప్రీంకోర్టు తీవ్రమైన వ్యాఖ్యలు చేసింది. యాక్షన్ ప్లాన్ కింద కాలుష్య నియంత్రణ చర్యలను అమలు చేయడానికి కొంత తక్షణ అవసరమని ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ కమిషన్‌కు సుప్రీంకోర్టు చెప్పింది. నాల్గో విడత ఎలాంటి ఆదేశాలు అడగకుండా తొలగించొద్దని కఠినమైన ఆదేశాలు ఇచ్చింది. గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ స్టేజ్-4ని తప్పనిసరిగా అమలు చేయాలని ఎన్‌సీఆర్ రాష్ట్రాలను సుప్రీంకోర్టు ఆదేశించింది. ఆంక్షలను పర్యవేక్షించేందుకు తక్షణమే టీమ్‌లను ఏర్పాటు చేయాలని చెప్పింది. జీఆర్‌పీలో పేర్కొన్న చర్యలపై తక్షణమే నిర్ణయం తీసుకోవాలని చెప్పింది. తదుపరి విచారణ వరకు నివారణ చర్యలను కోర్టుకు సమర్పించాలని చెప్పింది. నిబంధనలు ఉల్లంఘనలపై ఫిర్యాదులను పరిష్కరించేందుకు యంత్రాంగాన్ని సిద్ధం చేయాలని ఆదేశించింది. ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 450 కంటే తక్కువకు పడిపోయినప్పటికీ.. కోర్టు తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు యాక్షన్ ప్లాన్ అమలు కొనసాగుతుందని స్పష్టం చేసింది. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు సైతం ఇందుకు సమ్మతి తెలుపుతూ నివేదికను దాఖలు చేయాలని ఆదేశించింది. కాలుష్యం లేని వాతావరణంలో జీవించడం ప్రజల హక్కు అని.. ఈ మేరకు పరిస్థితిని సాధారణ స్థితికి తీసుకువచ్చేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సర్వోన్నత న్యాయస్థానం ప్రభుత్వాన్ని ఆదేశించింది. అయితే, పిటిషన్ తరపు న్యాయవాది విద్యార్థుల తరగతులపై కోర్టు దృష్టికి తీసుకువెళ్లగా.. 12 తరగతి వరకు తరగతులను నిలిపివేయాలని చెప్పింది.

## పవన్ సభలకు పోటెత్తున్న జనం

**ముంబై :** జనసేన అధినేత పవన్ కల్యాణ్ మహారాష్ట్రలో రెండు రోజుల ప్రచారానికి వెళ్లారు. తొలి రోజు మూడు సభల్లో ప్రసంగించారు. తెలుగు మూలాలున్న ఓటర్లు ఎక్కువగా ఉన్న నియోజకవర్గాల్లో పవన్ కల్యాణ్ ప్రచారం ప్లాన్ చేశారు. ఆయా జిల్లాలకు ఎన్నికల ఇంచార్జులుగా తెలుగు రాష్ట్రాల నేతలనే నియమించారు. గత నెల రోజులుగా వారు అక్కడ పని చేసుకుంటున్నారు. నాందేడ్ కు విష్ణువర్ధన్ రెడ్డి.. మరఠ్వాడాకు మధుకర్ ఇంచార్జులుగా వ్యవహరిస్తున్నారు. వీరు ఇంచార్జులుగా ఉన్న చోటనే పవన్ ప్రచారం చేస్తున్నారు.ప్రచారానికి వచ్చిన పవన్ కల్యాణ్‌కు ఏపీ బీజేపీ నేతలే స్వాగతం పలికారు. ఆయన ప్రసంగాలు కొద్దిగా మరాఠీతో పాటు తెలుగులోనే సాగాయి. పవన్ ప్రసంగాలకు అక్కడి ప్రజల నుంచి మంచి స్పందన వచ్చింది.పవన్ కల్యాణ్ సినిమాలు మరాఠీభాషలోనూ డబ్ అవుతాయి. తెలుగు మూలాలున్న ఓటర్లు ఉండటంతో సహజంగానే పవన్ కల్యాణ్ కు ఎక్కువ క్రేజ్ ఉంది. బహిరంగసభలకు జనం పోటెత్తారు. పవన్ సభలను సక్సెస్ చేసేందుకు.. బీజేపీ అగ్రనేతల సభలకు దీటుగా జన సమీకరణ చేశారు. పవన్ కల్యాణ్ ప్రసంగం వారిలో జోష్ నింపింది. మహారాష్ట్ర ప్రజలను తాను ఓటు అడగడానికి రాలేదని వారికి గౌరవం ఇవ్వడానికి వచ్చానని చెప్పి ఆకట్టుకున్నారు. మహారాష్ట్రలో ఉన్న జాతీయవాదానికి అనుగుణంగా పవన్ కల్యాణ్ ప్రసంగాలు సాగాయి.

# హైడ్రా మళ్లీ దూకుడు

-మొదటిపేజీ తరువాయి

వందనపురి కాలనీలో అక్రమ భవనాన్ని హైడ్రా అధికారులు కూల్చివేస్తున్నారు. ఉద్రిక్త పరిస్థితులు తలెత్తకుండా పెద్ద ఎత్తున పోలీసులను మోహరించారు. అమీన్ పూర్ మున్సిపాలిటీ పరిధిలో మరో రెండు చోట్ల అక్రమ నిర్మాణాలను గుర్తించారు. ఇటీవల నాగారం మున్సిపాలిటీలో రోడ్డును ఆక్రమించి నిర్మించిన ఇళ్లను కూల్చివేశారు. ముందుగానే హైడ్రా అధికారులు నోటీసులు ఇచ్చి 15 రోజులు గడువు ఇస్తున్నారు. రెండు వారాల్లో నిర్మాణాలను యజమానులే ఆక్రమణలు తొలగించకపోతే హైడ్రా రంగంలోకి దిగనుంది. తెలంగాణలో అక్రమ నిర్మాణాల కూల్చివేతల కోసం కాంగ్రెస్ సర్కార్ తీసుకున్న సంచలన నిర్ణయమే హైడ్రాదీనిని ఏర్పాటు చేసి మూడున్నర నెలలు దాటింది. ఎఫ్టీఎల్, బఫర్ జోన్ పరిధిలో ఉన్న చాలా అక్రమ నిర్మాణాలను హైడ్రా కూల్చి వేసింది. రాష్ట్ర చరిత్రలోనే మూడున్నర నెలల వ్యవధిలో 300కు పైగా అక్రమ నిర్మాణాల హైడ్రా నేలమట్టం చేసింది. ప్రభుత్వ ఆస్తులు, చెరువుల పరిరక్షణ కోసం జూలై 19వ తేదీన హైడ్రాను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం జీవో 99ను తీసుకువచ్చింది. దీంతో జూలై 26వ తేదీ నుంచి కూల్చివేతలను మొదలుపెట్టింది హైడ్రా. ఇప్పటి వరకు 30కు పైగా ప్రాంతాల్లో 300కు మించి ఆక్రమణలను కూల్చివేసింది. 100 రోజుల్లో 120 ఎకరాలను ప్రభుత్వానికి అప్పగింది. జీహెచ్ఎంసీతో పాటు 27 మున్సిపాలిటీలు, 33 గ్రామాల్లో హైడ్రా దూకుడు మామూలుగా లేదు. హీరో నాగార్జున ఎన్ కన్వెన్షన్ కూల్చివేతతో దేశవ్యాప్తంగా హైడ్రా పేరు మార్మోగింది.



**తీవ్ర వ్యతిరేకత రావడంతో..**

అయితే.. హైడ్రా కూల్చివేతలపై ప్రజలు హడెలెత్తిపోయారు. ఎప్పుడు ఎవరి ఇంటిని కూల్చివేస్తారో అని భయాందోళనలో ఉన్నారు. హైడ్రా కూల్చివేతలపై పలు చోట్ల తీవ్రమైన వ్యతిరేకత కూడా వచ్చింది. పలువురు న్యాయస్థానాలను ఆశ్రయించగా.. హైడ్రా చట్టబద్ధతపై కోర్టు కూడా ప్రశ్నించింది. జీవో 99పై స్టే ఇవ్వాలంటూ అనేక మంది హైకోర్టులో పిటిషన్లు వేశారు. ఈ క్రమంలో హైడ్రాకు ఎదురవుతున్న ఆటంకాలు తొలగిస్తూ ప్రభుత్వం ప్రత్యేక ఆర్డినెన్స్ రూపకల్పన చేసింది. ఈ ఆర్డినెన్స్‌ను గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆమోద ముద్ర వేశారు.

**పూర్తిస్థాయిలో బాధ్యతలు...**

ఇటీవల ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ బాధ్యతలను పూర్తిస్థాయిలో హైడ్రాకు అప్పగిస్తూ సర్కార్ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. గ్రేటర్ పరిధిలోని అక్రమ కట్టడాలన్నీ కూల్చివేసే పవర్ హైడ్రాకు ఇచ్చింది. ఈ మేరకు జీవో నెంబర్ 199ను ప్రభుత్వం విడుదల చేసింది. జీహెచ్ఎంసీ చట్టంలో పలుమార్పులు చేసింది. జీహెచ్ఎంసీ చట్టంలో మున్సిపల్ శాఖలో 374%దీ% ప్రత్యేక సెక్షన్ చేర్చింది. దీంతో బల్దియాతో పాటు 27 మున్సిపాలిటీలు, 33 గ్రామాల పరిధిలో హైడ్రా దూకుడు పెంచింది. ఇక నుంచి జీహెచ్ఎంసీ పరిధిలో ప్రభుత్వ ఆస్తులను పరిరక్షిస్తారు. అక్రమ కట్టడాలకు నోటిసుల జారీ నుంచి కూల్చివేతల వరకు అన్నీ హైడ్రా అమలు చేయనుంది.

# తెలంగాణలో నిజాం రాజ్యాంగం అమలవుతోంది

-మొదటిపేజీ తరువాయి

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తారని నిలదీశారు. ప్రజాస్వామ్య ప్రేమికులం... ప్రజాస్వామ్యబద్ధంగానే ఎదుర్కొంటామని పేర్కొన్నారు. నీ అక్రమ అరెస్టులకో... నీ ఉడత బెదిరింపులకో భయపడేది లేదు, ఈ అక్రమ అరెస్టులకు భయపడేవారు ఇక్కడ ఎవరూ లేరని పేర్కొన్నారు.

**కాంగ్రెస్ ద్వంద్వ వైఖరి**

అదానీ విషయంలో కాంగ్రెస్ ద్వంద్వ వైఖరి అవలంభిస్తోందని కేటీఆర్ అంతకుముందు మరో ట్వీట్ చేశారు. మిస్టర్ రాహుల్ గాంధీ అంటూ ఆయనను ఉద్దేశించి ఇంగ్లీష్‌లో ట్వీట్ చేశారు. మీ ద్వంద్వ వైఖరి కలవరపెడుతోందని, అసలు మీ వైఖరి ఏమిటో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. మోదీ-అదానీ కలిస్తే స్కాం అయితే... రేవంత్-అదానీ కలిస్తే న్యాయం అవుతుందా? అని నిలదీశారు. ధారవికి లక్ష కోట్లు వెచ్చిస్తున్నప్పుడు అది కుంభకోణమైతే... మూసీ ప్రాజెక్టుకు లక్షా యాభై వేల కోట్లు ఖర్చు చేస్తే న్యాయం అవుతుందా? అని నిలదీశారు. మీ వైఖరి బీజేపీకి భిన్నంగా ఉందా? మీ వైఖరి రాష్ట్రానికి రాష్ట్రానికి... ఎన్నికలకు ఎన్నికలకు మారుతుందా? అని ప్రశ్నించారు. బీజేపీ, కాంగ్రెస్... ఈ రెండూ ప్రజాస్వామ్యానికి, అభివృద్ధికి సురక్షితం కావన్నారు.

**మణిపూర్, లక్షద్వీప్ కంటే లగచర్ల ఘటన చిన్నదేమీ కాదు.. ప్రధాని మోదీ, రాహుల్ గాంధీ స్పందించాలి : కేటీఆర్**

మణిపూర్, లక్షద్వీప్ కంటే లగచర్ల ఘటన చిన్నదేమీ కాదని.. ఈ ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ స్పందించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు డిమాండ్ చేశారు. లగచర్ల బాధితులతో కలిసి ఆయన జాతీయ మానవహక్కుల సంఘాన్ని కలిశారు. అనంతరం బాధితులతో కలిసి ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. తెలంగాణలో ఏం జరుగుతుందో దేశానికి తెలియాలని.. పేద గిరిజనుల భూములను రేవంత్ సర్కార్ బలవంతంగా గుంజుకుంటోందని కేటీఆర్ ఆరోపించారు. అర్ధరాత్రి పోలీసులు, ప్రైవేటు వ్యక్తులతో కలిసి దళిత రైతుల ఇళ్లపై దౌర్జన్యకాండ జరుగుతుందని.. సీఎం బ్రదర్ గిరిజన రైతులపై



దాడి చేసినా కేసులుండవని విమర్శించారు. ప్రజాప్రతినిధి కాకున్నా సీఎం సోదరుడికి కలెక్టర్ స్వాగతం పలుకుతున్నారన్నారు. రాజ్యాంగ రక్షకులమంటున్న రాహుల్ సీఎం నియోజకవర్గంలో దమనకాండ స్పందించాలన్నారు. లగచర్లలో అర్ధరాత్రి మహిళలపై పోలీసుల దాడి చేశారని.. గిరిజన రైతులపై అక్రమంగా అరెస్టు చేసి చిత్రహింసలు పెట్టారన్నారు.

**లగచర్ల ఘటనపై ఎందుకు స్పందించరు?**

లగచర్ల ఘటనపై ప్రధాని మోదీ, రాహుల్, ఖర్గే ఎందుకు స్పందించరు? అంటూ ప్రశ్నించారు. మణిపూర్, లక్షద్వీప్ కంటే లగచర్ల ఘటన చిన్నదేమీ కాదని.. సీఎం సోదరుడి కంపెనీ కోసమే ఇంతమంది గిరిజనులు బాధపెడుతున్నరని ఆరోపించారు. తెలంగాణలో ఏం జరుగుతుందో తెలియనట్లు బీజేపీ నాటకాలు ఆడుతుందని.. సీఎం నియోజకవర్గంలో జరుగుతున్న దమనకాండపై స్పందించాలని డిమాండ్ చేశారు. పేద గిరిజనుల బాధ రాహుల్‌గాంధీకి కనిపిస్తలేదా?.. లగచర్లపై అర్ధరాత్రి దమనకొండ బీజేపీకి కనబడడం లేదా? అంటూ నిలదీశారు. కొడంగల్‌లో 3వేల ఎకరాల్లో ఫార్మా విలేజీ కోసం సీఎం నిర్ణయించారని.. రైతులకు నోటీసులు ఇచ్చి.. వాటిని తిరస్కరించిన వారిని బెదిరిస్తున్నారన్నారు. మహారాష్ట్ర ఎన్నికల ప్రచారం గడువు ముగిసింది.. రాహుల్ ఇప్పటికైనా స్పందించాలని.. రైతులతో చర్చలు జరిపేందుకు ఎవరూ ముందుకురావడం లేదన్నారు. ఫార్మా సిటీ కోసం మా హయాంలో 14వేల ఎకరాల భూమిని సేకరిస్తున్నారని.. తమ హయాంలో ఆ రైతులందరినీ ఒప్పించి భూములను సేకరించామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యాలను ఎత్తి చూపితే అక్రమ అరెస్టులు చేస్తున్నారన్నారు.

**ఆరు గ్యారంటీలతో కాంగ్రెస్ మోసం**

కాంగ్రెస్ ఆరు గ్యారంటీలతో తెలంగాణ ప్రజలను మోసం చేసిందని.. మా బీఆర్ఎస్ నేతలందరూ జాతీయ మానవహక్కుల, మహిళా హక్కుల కమిషన్‌ను కలిశారన్నారు. ఎస్టీ హక్కుల కమిషన్ సైతం కలిసి లగచర్ల దమనకాండ వివరించారన్నారు. సీఎం నియోజకవర్గంలో తొమ్మిది నెలలుగా గొడవలు జరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. ఎకరానికి రూ.60-రూ.70లక్షల విలువైన భూమికి రూ.10లక్షలు ఇస్తామంటున్నారని.. లగచర్ల అర్ధరాత్రి మహిళలనీ చూడకుండా దాడులు చేశారన్నారన్నారు. గిరిజన రైతులను అరెస్టు చేసి చిత్రహింసలు పెట్టారని.. మణిపూర్ గురించి మాట్లాడే రాహుల్ గాంధీ కొడంగల్ దమనకాండపై ఎందుకు మాట్లాడరు ? మండిపడ్డారు. రాహుల్ గాంధీ, ప్రధాని నరేంద్ర మోదీ సైతం స్పందించాలని డిమాండ్ చేశారు.

**రాజ్యసభలో లేవనెత్తుతాం..**

రాజ్యసభలో ఈ విషయం లేవనెత్తుతాం.. పార్లమెంట్‌లోనూ ఈ విషయం మాట్లాడాలని కోరుతామన్నారు. లగచర్ల బాధితుల తరఫున ఢిల్లీకి బీఆర్ఎస్ శ్రేణులందరికీ ధన్యవాదులు చెబుతున్నానన్నారు. న్యాల్‌కల్‌తో పాటు పలుచోట్ల భూముల విషయంలో ప్రజలు నిరసనలు తెలుపుతున్నారని.. కందుకూరు, యాచారంలో పర్యటించి రైతుల్లో కాంగ్రెస్ నేతల్లో విషం నింపారన్నారు. అదే 14వేల ఎకరాల్లో ఫోర్త్‌సిటీ, ఫార్మా విలేజీలను ఏర్పాటు చేస్తున్నారని, భూములు ఇవ్వకపోతే తొక్కుతామని సీఎం సోదరుడు అంటున్నాడని మండిపడ్డారు. కొడంగల్ నియోజకవర్గంలో ఇంత ఆందోళన జరిగితే రేవంత్ మహారాష్ట్రలో ప్రచారం చేస్తారా? అంటూ ధ్వజమెత్తారు. ఢిల్లీకి మూటలు పంపుతున్నందుకు రేవంత్ ఐదేళ్లు ముఖ్యమంత్రిగా ఉంటారని.. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అస్థిరపరిచే ఉద్దేశం మాకు లేదన్నారు. కాంగ్రెస్ ఐదేళ్లు ఉంటే మేం పదేళ్లు అధికారంలో ఉంటామన్నారు.

# కాంగ్రెస్ పార్టీలో ఉన్న స్వేచ్ఛ ఏ పార్టీలో లేదు



సంగారెడ్డిలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తలు సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా %ూజజ% చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీలో ఉన్న స్వేచ్ఛ ఏ పార్టీలో లేదన్నారు. సీఎం రేవంత్ ని వ్యతిరేకించిన అది పార్టీ కోసమే కానీ వ్యక్తి గతం కాదన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు కొంత నారాజ్ ఉన్నారని.. తాము మీకు అండగా ఉంటామని భరోసా కల్పించారు. మన ప్రభుత్వంలో చేస్తున్న అభివృద్ధి పనులను ప్రతి ఒక్క కార్యకర్త ప్రజలకు వివరించాలని సూచించారు. జనవరిలో కొంతమంది పార్టీ నాయకులకు పదవులు ఇస్తామని చెప్పుకొచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మన సత్తా చాటాలని అన్నారు.

**కుట్రలు చేస్తున్నాయి..**

అధికారంలోకి వచ్చి 11 నెలల్లోనే ప్రతిపక్షాలు కుట్రలు చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ, బీఆర్ఎస్ కుమ్మక్కై కాంగ్రెస్ పార్టీపై కుట్ర పన్నుతున్నాయన్నారు. కార్యకర్త కూడా సీఎంను కలిసే వెసులుబాటు కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉందని వ్యాఖ్యానించారు. కార్యకర్తలు నారాజ్ అయితే తాము కుర్చీ దిగాల్సిందేనన్నారు. మరోసారి మనం అధికారంలోకి రావాలి.. ఢిల్లీలో రాహుల్ గాంధీ ప్రధాని కావాలి అని కామెంట్స్ చేశారు.

**వారు తప్ప ఎవరూ మిగలరు..**

కేసీఆర్ రాష్ట్రాన్ని ఆగం చేస్తే కాంగ్రెస్ పార్టీ రిపేర్లు చేస్తుందన్నారు. బంగారు తెలంగాణ అంటే కేసీఆర్ కుటుంబం మాత్రమే బంగారుమయం అయ్యిందని సెటైర్లు వేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో బీటలు బారుతున్నాయని.. కాంగ్రెస్ పార్టీ కట్టిన ప్రాజెక్టు 70 ఏళ్లయిన చెక్కు చెదరలేదని అన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావుకి పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సవాల్ విసిరారు. మీరు పదేళ్లలో ఎంత అభివృద్ధి చేశారో చెప్పండి..మేము 11 నెలల్లో ఎంత అభివృద్ధి చేశామో చూపిస్తామని ఛాలెంజ్ చేశారు. వచ్చే ఎన్నికల నాటికి తెలంగాణలో బీఆర్ఎస్ ఉండదని సంచలన వ్యాఖ్యలు చేశారు. హరీష్ రావు కూడా పక్క చూపులు చూస్తున్నాడని.. చివరికి పార్టీలో తండ్రి, కొడుకు, కూతురు తప్ప ఎవరూ మిగలరని ఎద్దేవా చేశారు.

## తెలంగాణ సమాజం దిగజారుడు రాజకీయాలను సహించదు


-మొదటిపేజీ తరువాయి

మాటలకు తాను స్పందించనన్నారు. లగచర్ల ఘటనపై తమ పార్టీ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. తాను భారతీయులకు మాత్రమే గులామ్‌ను అని కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. డిసెంబర్ 1 నుంచి 5 వ తేదీ వరకు బీజేపీ అంటే ఏంటో ఈ రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి చూపిస్తామన్నారు. తెలంగాణలో మీ పని తీరుపై ప్రజలతోనే మాట్లాడుతామని చెప్పారు. మరోవైపు గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల సమయంలో.. కాంగ్రెస్ పార్టీ ఎన్నో హామీలు గుప్పించింది. ఆ క్రమంలో వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని ఆ పార్టీ ప్రకటించింది. కానీ వాటిని అమలు చేయడంలో రేవంత్ రెడ్డి సర్కార్ ఘోరంగా విఫలమైందని బీజేపీ ఆరోపిస్తుంది. అందుకు నిరసనగా డిసెంబర్ 1వ తేదీ నుంచి 5వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీజేపీ నిరసన తెలపాలని నిర్ణయించింది. అందులోభాగంగా పాదయాత్రల ద్వారా నిరసన తెలపాలని పార్టీ అగ్ర నాయకత్వం స్పష్టం చేసింది. దీంతో డిసెంబర్ 1 నుంచి అన్ని నియోజకవర్గాల్లో నిరసన పాదయాత్రలు చేపట్టనున్నారు. అలాగే మూసీ పరివాహక ప్రాంతాల్లో రాత్రి వేళల్లో బస చేయాలని బీజేపీ నిర్ణయించిన విషయం తెలిసిందే.

**బీజేపీ ఎంపీ డి.కె .అరుణ**

లగచర్లలో రేవంత్ రెడ్డి కుటుంబ ప్రభుత్వం నడుస్తుందని బీజేపీ ఎంపీ డీ.కే.అరుణ మండిపడ్డారు. ఒకసారి సీఎం రేవంత్ రెడ్డి సోదరుడు వెళ్లి బెదిరించి వస్తాడన్నారు. మరోసారి రేవంత్ రెడ్డి నేరుగా బెదిరిస్తాడని చెప్పారు. పరిశ్రమకు భూములు ఇవ్వకుంటే.. జైళ్లలో ఉంటారంటూ రైతును భయ భ్రాంతులకు గురి చేస్తున్నారని విమర్శించారు. స్వయంగా ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గంలోనే శాంతి భద్రతలు లేవని ఆమె పేర్కొన్నారు. నియోజకవర్గ ప్రజలు బిక్కుబిక్కు మంటూ ఉంటున్నారన్నారు. అయితే వారిందరికీ బీజేపీ అండగా ఉంటుందని ఎంపీ డీకే అరుణ హామీ ఇచ్చారు.

## హైదరాబాద్‌లో మరో కంపెనీపై ఐటీ దాడులు




**హైదరాబాద్:** నగరంలోని పలు ప్రాంతాల్లో స్వస్తిక్ గ్రూప్ సంస్థలపై ఆదాయపు పన్ను అధికారులు దాడులు నిర్వహిస్తున్నారు. పలు బృందాలుగా ఏర్పడిన అధికారులు బేగంబజార్‌లోని స్వస్తిక్ మిర్చి కార్యాలయంతోపాటు బంజారాహిల్స్, చేవెళ్ల, షాద్‌నగర్‌లో ఏకకాలంలో సోదాలు చేపట్టారు. స్వస్తిక్ రియల్టర్ కంపెనీలో తనిఖీలు చేస్తున్న ఐటీ అధికారులు.. ఆ సంస్థ మేనేజర్లు కల్పన రాజేంద్ర, లక్ష్మణ్ నివాసాలపై సైతం దాడులు చేశారు. షాద్‌నగర్‌లో ఓ మల్టీ నేషనల్ కంపెనీ(%వీచీజ%)కి రూ.300 కోట్ల విలువైన భూమిని స్వస్తిక్ రియల్టర్ కంపెనీ విక్రయించింది. అయితే దానికి సంబంధించిన వివరాలను కంపెనీ బ్యాలెన్స్ షీట్‌లో ఎక్కడా చూపలేదనే ఆరోపణలు గుప్పుమన్నాయి. ఈ నేపథ్యంలో భారీ బందోబస్తు నడుమ ఐటీ అధికారులు సోదాలు చేపట్టారు.

## జిల్లాల పర్యటనలకు సీఎం ప్లాన్

-మొదటిపేజీ తరువాయి

19న వరంగల్ లో మహిళ సదస్సు పేరుతో సీఎంతోపాటు మంత్రులందరు పర్యటిస్తారు. ఆ మరుసటి రోజు 20న రాజన్న సిరిసిల్ల జిల్లాలో సీఎం పర్యటిస్తారు. సిరిసిల్లలో ఎస్పీ కార్యాలయం ప్రారంభించడంతో వేములవాడ రాజన్నను దర్శించుకుని ఆలయ అభివృద్ధి తోపాటు రోడ్డు వెడల్పు పనులకు శంకుస్థాపన చేస్తారు. సిరిసిల్ల నేత కార్మికులకు బాసటగా నిలిచేలా 50 కోట్లతో యార్న్ డిపోకు భూమిపూజ చేయనున్నారు. రాజన్న జాతర గ్రౌండ్ లో భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఏర్పాట్లను రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పరిశీలించి అధికారులతో సమీక్షించారు.జిల్లాల పర్యటనలో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి ఈనెల 25న కరీంనగర్ లో పర్యటించి యువజన సదస్సులో పాల్గొననున్నారు. అందుకు అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. కరీంనగర్ ఎస్ ఆర్ ఆర్ డిగ్రీ కళాశాల లేదా అంబేద్కర్ స్టేడియంలో యువజన సదస్సు నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే రెండు ప్రదేశాలను జిల్లా కలెక్టర్ ప్రమేలా సత్పతి జిల్లా అధికారులతో కలిసి పరిశీలించి ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. రెండు మూడు రోజుల్లో సభా స్థలం ఖరారు కానుంది.ఈనెలాఖరున మహబూబ్ నగర్ లో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో రైతు సదస్సు నిర్వహించనున్నారు. ఆ తర్వాత డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో హైదరాబాద్ కేంద్రంగా కార్నివాల్ గా మూడు రోజుల పాటు రాష్ట్ర స్థాయి ఉత్సవాలు నిర్వహిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. రాజన్న సిరిసిల్ల, వరంగల్ జిల్లాల అధికారులతో సీఎం టూర్ ఏర్పాట్లపై మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్షించి సభా ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి చేసిన కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించేందుకు సిఎం రేవంత్ రెడ్డి జిల్లాల పర్యటనతో పాటు రాష్ట్ర స్థాయి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. కాంగ్రెస్ చేపట్టిన పథకాలు, ప్రజలకు చేసిన మేలు, సాధించిన విజయాలు, ప్రజలకు పంచిన నిధులు ఇలా ప్రతి అంశంపై ఈ సభలో మాట్లాడతారు. విజయోత్సవ సభల్లోనే కొన్ని పథకాలను కూడా ప్రభుత్వం ప్రారంభించబోతోందని తెలుస్తోంది. హన్మకొండ వేదికగా జరిగే సభలో 22 జిల్లాల ఇందిరా మహిళా శక్తి భవనాలకు సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేస్తారు. అభివృద్ధి సంక్షేమాన్ని సమానంగా నడిపిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం అందరి ప్రశంసలు అందుకుంటుందన్నారు అటవీశాఖ మంత్రి కొండా సురేఖ. 19న జరిగే మీటింగ్‌కు భారీగా జనం తరలి రావాలని పిలుపునిచ్చారు. ఇందిరమ్మ రాజ్య స్థాపనకు రేవంత్ రెడ్డి కీలక నిర్ణయాలు తీసుకుంటురన్నారని దానికి మద్దతు తెలపాలని పిలుపునిచ్చారు. వరంగల్ డిక్లరేషన్‌లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్న ప్రభుత్వం మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు అమలు దిశగా వెళ్తోందని అన్నారు. ముఖ్యంగా మహిళలపై ప్రత్యేకంగా ఫోకస్ చేసినట్టు వెల్లడించారు. అందుకే ఇందిరమ్మ జయంతి రోజున వరంగల్‌లో సభ పెడుతున్నామని తెలిపారు.

## గ్రూప్-3 పరీక్షలకు 50 శాతం మందే హాజరు



**హైదరాబాద్ :** టీజీపీఎస్సీ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రూప్-3 పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. మూడు పేపర్లకు కలిపి మొత్తంగా 50 శాతం మందే హాజరయ్యారు. నిన్న నిర్వహించిన పేపర్1 పరీక్షకు 51.1 శాతం, పేపర్ 2 పరీక్షకు 50.7శాతం హాజరు కాగా, సోమవారం నిర్వహించిన పేపర్ 3కి 50.24 శాతం మంది హాజరైనట్లు టీజీపీఎస్సీ అధికారులు వెల్లడించారు. అత్యధికంగా నల్లగొండ జిల్లాలో 71.30 శాతం మంది హాజరు కాగా, అత్యల్పంగా వరంగల్ జిల్లాలో 49.93 శాతం మంది హాజరయ్యారు. ఈ గ్రూప్-3 నోటిఫికేషన్ ద్వారా 1363 పోస్టులను భర్తీ చేయనున్నారు.

## సంపాదకీయం

# 'మహా' ఏకపక్షంగా సాగేనా!

పార్టీకో ఎజెండా, ప్రాంతానికో సమస్య, కులానికో కోరికతో సంక్లిష్ట రాజకీయాలకు కేరాఫ్‌గా మారిన మహారాష్ట్రలో ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల్లో ఎవరు ముందంజలో ఉన్నారో అంచనా వేయడం అంత సులభం కాదు. క్షేత్ర స్థాయి నుంచి అందుతున్న అనేక రకాల ట్రెండ్స్‌ని అధ్యయనం చేస్తున్న పీపుల్స్ పల్స్ పరిశోధనలో పలు ఆసక్తికరమైన విషయాలు వెల్లడవుతున్నాయి. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో మొన్నటి లోక్‌సభ ఫలితాలే పునరావృతమవుతాయి అనుకోలేం. గడిచిన నాలుగు నెలల్లో ఇక్కడ అనేక మార్పులు సంభవించాయి. చాలా రాష్ట్రాల్లోలాగే మహారాష్ట్రలో కూడా కులం ఎన్నికలను ప్రభావితం చేస్తుంది. ఎస్సీలు, ఓబీసీలతో పాటు మరాఠాలు, ధంగార్లు పార్టీల భవిష్యత్తును నిర్ణయించబోతున్నారు. ముందు నుంచి దళితులు కాంగ్రెస్‌కు మద్దతుగా ఉంటున్నారు. కాంగ్రెస్‌ని దెబ్బ తీయడానికి ఎస్సీ, ఎస్టీ ఉప వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పును బిజెపి సానుకూలంగా మార్చుకుంది. దళితుల్లో చీలిక తెచ్చి చంభర్‌లు, మాతంగ్‌లు, ఖాటిక్‌ల వంటి బౌద్ధేతర ఎస్సీలను తమ వైపు తిప్పుకునే ప్రయత్నం చేస్తోంది. తమను ఓబీసీలో చేర్చాలని మరాఠాలు చేస్తున్న డిమాండ్‌తో వారు తమకు దూరం అవుతారనే సందేహాల మధ్య ప్రత్యామ్నాయంగా ఓబీసీలను తమవైపు తిప్పుకోవడానికి బిజెపి వ్యూహాలు రచించింది. వివిధ ఓబీసీ కులాల నుంచి సీనియర్ నాయకులను ప్రోత్సహించడం, ఓబీసీ జాబితాలో కొత్తగా 15 చిన్న కులాలను చేర్చడం ద్వారా ఓబీసీలను గంపగుత్తగా తమ వైపు తిప్పుకునే ప్రయత్నం చేస్తోంది. ఇందులో భాగంగా ఎన్సీపీ అజిత్ పవార్ వర్గానికి చెందిన ఛగన్ భుజ్‌బల్ వంటి నాయకులను బలపరుస్తోంది. ఓబీసీలలో మాధవ్ మాలి, ధంగర్, వంజరి వంటి ప్రాతినిధ్యం లేని కులాలను కూడా బిజెపి సమీకరించింది. మరత్వాడా, పశ్చిమ మహారాష్ట్ర, విదర్భలో మరాఠాల ఆధిపత్యాన్ని ఎదుర్కోవడానికి వంజరి సామాజిక తరగతిని ముందుకు తెస్తోంది. మహారాష్ట్రలో పలు సామాజిక వర్గాలు రిజర్వేషన్లు కోరుతుండటంతో, ఇతర కులాలు తమ ప్రయోజనాలు దెబ్బతింటాయని భయపడుతున్నాయి. ఆయా సామాజిక తరగతుల వారిని ఆకర్షించడానికి పార్టీలో ప్రాధాన్యతనివ్వడం, పదవులనివ్వడం ద్వారా అటు ఎంవీయే, ఇటు మహాయుతి ఎత్తులు, పైఎత్తులు వేస్తున్నాయి. బిజెపి 1995 నుంచి పట్టణ ఓటర్లను ఆకర్షించడానికి ఒక ప్రణాళిక ప్రకారం అడుగులు వేస్తోంది. బిజెపి చేపట్టిన రోడ్లు, ఇతర అభివృద్ధి ప్రాజెక్టులకు రాష్ట్రంలోని మహాయుతి ప్రభుత్వం చేయూతనిచ్చింది. దీంతో ప్రస్తుత ప్రభుత్వం అందిస్తున్న మౌలిక సదుపాయాల పట్ల పట్టణ ప్రజల్లో అంచనాలు పెరిగేలా చేయగలిగింది. మరోవైపు, గ్రామీణంలో ఆదరణ ఉందని భావిస్తున్న ఎంవీయే కూటమి ఓటర్లను తనవైపు తిప్పుకునేందుకు స్థానిక సవాళ్లను అధిగమించడంతో పాటు, మహారాష్ట్ర ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు పరిష్కారం చూపాల్సి ఉంది. విదర్భ, మరాత్వాడాలో వ్యవసాయ సంక్షోభం తీవ్రంగా ఉంది. రైతులు అప్పుల్లో కూరుకుపోవడం, పంటలకు గిట్టుబాటు ధర లేకపోవడం వంటి ఒత్తిళ్లతో తీవ్రస్థాయిలో ఆత్మహత్యలు నమోదవుతున్నాయి. వారు పండించే పంటలకు మద్దతు ధర, మెరుగైన మార్కెట్ల సదుపాయాలు వంటి పరిష్కారాలు అందించగలమనే నమ్మకం కలిగిస్తేనే గ్రామీణ ఓటర్ల మద్దతును ఏంవీయే పొందగలుగుతుంది. మహారాష్ట్రలో నిరుద్యోగం అతి పెద్ద సమస్యగా మారింది. ఉపాధి కల్పించాలని స్థానిక యువత కోరుతోంది. రాష్ట్రానికి పరిశ్రమలు తీసుకురావడానికి ఎంవీయే దగ్గర ఎలాంటి ప్రణాళికలు ఉన్నాయో వచ్చే నాలుగైదు రోజుల్లోనైనా స్పష్టంగా చెప్తే, నిరుద్యోగుల ఓట్లు పడే అవకాశం ఉంది. అంతేకాక, రాష్ట్రంలో ప్రాంతానికో సమస్య ఉంది. ఈ సమస్యల్ని పరిష్కరించడంలో అధికార మహాయుతి విఫలమైందనడంలో ఎలాంటి సందేహం లేదు. కానీ, అదే సమయంలో మహా వికాస్ అఘాఢి తమ సమస్యల్ని తీర్చగలదా? అనే సందేహం కూడా ప్రజలను వెంటాడుతోంది. 36 స్థానాలున్న ముంబైలో మధ్యతరగతి ప్రజలకు అందుబాటు ధరల్లో ఇళ్లు దొరకడం గగనమైంది. ధారవి సహా మురికివాడలను శుభ్రం చేయడానికి చేపట్టిన ప్రాజెక్టులు పూర్తి చేయడంలో అధికారపక్షం విఫలమైంది. ముంబైలో బస్సులు, లోకల్ ట్రైన్స్ సహా ప్రజా రవాణా సమస్యలకు సరైన పరిష్కారం చూపించలేకపోయింది. మహారాష్ట్రలో 39 స్థానాలు ఉన్న థానే, కొంకణ్ ప్రాంతంలో వధవన్ పోర్ట్, విహార్ అలీబాగ్ మల్టీమోడల్ కారిడార్, బర్సులో పెట్రో కెమికల్ రిఫైనరీ వంటి ప్రాజెక్టుల పట్ల ప్రజలు వ్యతిరేకంగా ఉన్నారు. ఇవి తమ చుట్టూ ఉన్న పర్యావరణాన్ని నాశనం చేస్తాయని భావిస్తున్నారు. వీటికి అధికారపక్షం పరిష్కారం చూపలేకపోయింది. మరోవైపు ఏంవీయే నుంచి కూడా దీనిపై స్పష్టమైన భరోసా రావడం లేదు. దీంతో పాటు థానే, కొంకణ్ ప్రాంతంలో నిరుద్యోగం పెరగడం, రారుగఢ్ నుంచి వలసలు పెరగడం స్థానిక ప్రజలు ఇబ్బందులుగా భావిస్తున్నారు. 58 స్థానాలు ఉన్న పశ్చిమ మహారాష్ట్ర నుంచి పెద్ద ప్రాజెక్టులను గుజరాత్‌కి తరలడంతో నిరుద్యోగం పెరిగిందని యువత అభిప్రాయ పడుతోంది. ఇక్కడ సాగునీటి సమస్యలను కూడా మహాయుతి పరిష్కరించలేకపోయింది. 47 స్థానాలు ఉన్న ఉత్తర మహారాష్ట్రలోని గిరిజన ప్రాంతాల్లో మౌలిక సౌకర్యాల అభివృద్ధి జరగలేదు. దీంతో గిరిజనులు మహాయుతి పట్ల అసంతృప్తిగా ఉన్నారు. మరోవైపు మద్దతు ధరపై కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు పట్ల ఉత్తర మహారాష్ట్రలో అధికంగా ఉండే ఉల్లి రైతులు ఆగ్రహంగా ఉన్నారు. విదర్భ ప్రాంతంలో అధికంగా 62 స్థానాలున్నాయి. ఇక్కడ పత్తి, సోయాబీన్ రైతులు తమ పంటకు కనీస మద్దత ధర కావాలని ఆందోళనలు చేస్తున్నారు. ఈ ప్రాంతంలో కొన్ని చోట్ల పులుల సంచారం పెరిగి జనావాసాల్లోకి వస్తున్నాయని ఫిర్యాదులు ఇస్తున్నా సరైన చర్యలు తీసుకోవడం లేదని ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నారు. పారిశ్రామిక అభివృద్ధి కేవలం నాగ్‌పూర్‌కే పరిమితం అయ్యిందని, దీంతో ఇతర చిన్న పట్టణాల్లో నిరుద్యోగం పెరిగిందని యువత అసంతృప్తిగా ఉంది. రాష్ట్రంలో మహాయుతి, ఎమ్‌వీయే కూటముల మధ్య పోటాపోటీ ఉండడంతో రాజ్ థాకరే, ప్రకాష్ అంబేద్కర్, అసదుద్దీన్ ఒవైసీ నేతృత్వంలోని చిన్న పార్టీలను, నాయకులను ప్రజలు పక్కన పెట్టారు. దీంతో ఈ ఎన్నికలు రెండు కూటముల మధ్య ద్విముఖ పోటీగా మారాయి. అయితే, ఈ చిన్న పార్టీల నాయకుల్లో ఎవరైనా అనుహ్య ఫలితాలు సాధిస్తే, ఇరు కూటముల పరిస్థితి ఎలా వుంటుందో!

# కనుమరుగు అవుతున్న కట్టడాలు




ప్రపంచ సాంస్కృతిక వారసత్వ దినోత్సవం ప్రతి ఏట నవంబర్ 19న ప్రపంచ వ్యాప్తంగా నిర్వహిస్తారు. వారసత్వ పరిరక్షణ అంశాల ఆధారంగా 1984, జనవరి 27న నాటి భారతదేశ ప్రధాని ఇందిరా గాంధీ ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ చైర్మన్‌గా భారత జాతీయ సంస్కృతి వారసత్వ సంస్థ (ఇండియన్ నేషనల్ ట్రస్టు ఫర్ ఆర్ట్ అండ్ కల్చరల్ హెరిటేజ్ –ఇంటాక్) అనే సంస్థ ఏర్పాటు చేయబడింది. దీనికి తోడుగా, భారతదేశ వారసత్వ సంపద విలువ, వాటి పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కలిపించేందుకు 'భారత ప్రభుత్వ సాంస్కృతిక శాఖ', 'రాష్ట్ర పురావస్తు శాఖ'లకు బాధ్యతలు అప్పగించ బడ్డాయి. అవి భక్త కరీంనగర్ జిల్లా గత కీర్తికి ప్రాచీన చరిత్రకు నిలువుటద్దంగా నిలిచి ఉంది. రాష్ట్ర పురావస్తు శాఖ విశ్రాంత డైరెక్టర్ డాక్టర్ వి. వి. కృష్ణ శాస్త్రి అపురూప పరిశోధనల ఫలితంగా, జిల్లా పాక్చరిత్ర 50వేల సంవత్సరాలకు పూర్వం ఉన్నదని రుజువైతే, అది సామాన్యమైన విషయమేమీ కాదు. గౌతమి నదీ దక్షిణ తీరమున పరి వ్యాప్తమై ఉన్న, కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో, ఉత్తర దక్షిణ భారతీయులకు, సేతువై నిలిచిన ఈ ప్రాంత నాగరికత, కాల ప్రవాహంలో కొట్టుకుని పోయినా, ఉత్సాహవంతులైన చారిత్రక పరిశోధకుల అవిరళ కృషి ఫలితంగా కథలుగా, గాథలుగా, నోళ్లలో, రాళ్లలో, ఆకులలో, రేకుల లో అక్కడక్కడ నిక్షిప్తమైయున్న చరిత్ర కొంతవరకు వెలుగులోనికి రాగలిగింది. చరిత్రలో ఆంధ్రులకు లభించినంత వరకు, శాతవాహనులు మొట్టమొదటి రాజ వంశం అనీ, అదీ మహారాష్ట్రలోని పైఠానో లేక నాసిక ప్రాంతము అనుకుంటే కాదని, అంతకుముందే పురాణాలలో పేర్కొనబడిన ఆంధ్ర భృత్యులని, తొలి ఆంధ్ర ప్రభువుల సేవకులనే విషయం, కోటిలింగాల తవ్వకాలలో బయల్పడడం విశేషం. కరీంనగర్ జిల్లాలోనే శాతవాహనుల మూలపు రుషులకు ఆవాస స్థానమని చారిత్రక పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయి. శ్రీముఖుని కి చెందిన నాణాలను, ధర్మపురి వాస్తవ్యుడైన చారిత్రక పరిశోధకుడు కీర్తిశేషులు సంగనభట్ల నరహరిశర్మ కనుగొన్నాక, శాతవాహన వంశానికి మూల పురుషుడు అనదగిన శ్రీముఖుడు, కోటిలింగాల రాజధానిగా చేసుకొని పరిపాలించాడని రుజువైనాక, చరిత్రలో నూతన అధ్యాయానికి నాంది పలికింది. క్రీస్తుపూర్వం శతాబ్దాల క్రితమే ఆంధ్ర రాజ్యం, శాతవాహనుల ఏలుబడిలో వర్ధిల్లిన, వారి అభిమాన పాత్రమైన బౌద్ధమతం, ఈ ప్రాంత ప్రజల ఆరాధ్య మత మై విరాజిల్లింది. ప్రాచీనమైన ప్రతి గ్రామం పేరులో ప్రతి నిర్మాణ కౌశలంలో, ప్రతి కట్టడం లో వస్తువులు, మట్టి పాత్రలు, మతంతో పెనవేసుకున్న చరిత్ర పలుకుతుంది. శాతవాహన చక్రవర్తుల చత్రచ్ఛాయలలో, బౌద్ధమతం విస్తరించి, శాంతి అహింసలు, విశ్రమించిన ఈ ప్రాంతాల్లో, నాటి ప్రజల ఆరాధ్యాలైన స్థూపాలు, శిల్పాలు, కట్టడాలు, తవ్విన చోటల్లా దర్శనమిస్తూ, వెలకట్టలేని వేల సంవత్సరాల చరిత్రకు, మౌన సాక్షీ భూతాలుగా నిరాదరణ నీడలో మగ్గుతూ, తమ దుస్థితికి చింతిస్తూ, అనాసక్తులైన, అధికారుల, ప్రజాప్రతినిధుల అశ్రద్ధ, నిర్లక్ష్యానికి క్రుంగి కృశిస్తు, ఆయువు తీరకముందే అస్తమిస్తున్నాయి. నిన్నటి వరకు ఆలనా పాలనా కరువై "బుద్ధం శరణం గచ్ఛామి" అంటూ దీనంగా విలపించిన ధర్మపురి నియోజకవర్గంలోని పాషా యిగాం బౌద్ధ స్తూపం, ఒక కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా మూలమట్టం అయింది. క్రీస్తుపూర్వం ఆరవ శతాబ్దంలో గంగా మైదానం ప్రాంతాలలో బౌద్ధమత వ్యాప్తి జరిగినా, అశోకుని కాలం కన్నా ముందే ప్రవేశించిన బౌద్ధమతం, శాతవాహనుల హయాంలో విశేష ఆదరణ పొందింది. కరీంనగర్ జిల్లాలో మూడు ప్రాచీన బౌద్ధ కేంద్రాలు ఉండేవి. వాటిలోని ధర్మపురి సమీప క్రీస్తుపూర్వం 200 సంవత్సరాల సంబంధిత పాశాయిగాం బౌద్ధ స్థూపాన్ని కి విశేష ప్రాధాన్యత ఉండేది. దీనికి 6 వృత్తాకారపు పలకలు ఉండేవి. వీటిపై ఒక పద్మం, ఏనుగు బొమ్మలు, స్థూపానికి ఇరువైపులా, స్తం భాకృతులు కలిగియున్న ఆ స్తూపం రెండవ శతాబ్దానికి చెందినదిగా "దూళికట్ట స్థూపం కన్నా ప్రాచీనమైనదిగా", "జిల్లాలోని మొట్టమొదటి రాతి కట్టడం"గా చరిత్రకారులు రుజువు పరిచారు. క్రీస్తు పూర్వం రెండవ శతాబ్దం నాగ సింపీ యకాయ, జమజోరాగ బ్రహ్మ లేఖలు, స్తూపం వద్ద లభ్యమైనాయి. శాతవాహనుల తొలి రాజధాని అయిన కోటిలింగాలకు మూడు కిలోమీటర్ల దూరంలో, ప్రస్తుత రాయపట్నం – కరీంనగర్ రాష్ట్ర రహదారిని ఆనుకుని, పాశాయిగాం గుట్టపై చెన్నపూస అనే ఆచార్యుడు, బౌద్ధ స్థూపాన్ని నిర్మించినట్లు, సుప్రసిద్ధ బౌద్ధ ఆచార్యుడు దిజ్ఞాగుడు, ఈ ప్రాంతం వాడేనని, చైనా యాత్రికుడు హ్యూన్ త్సాంగ్ ఏడవ శతాబ్దంలో తన గ్రంథంలో పేర్కొన్నాడు. రాష్ట్ర పురావస్తు శాఖ మాజీ డైరెక్టర్ వి.వి. కృష్ణ శాస్త్రి శాతవాహన కళా ఉత్సవాల సందర్భంగా, 2002 జనవరి 21న కరీంనగర్లో ప్రధాన ప్రాసంగికునిగా ప్రకటించడాన్ని బట్టి, పాషాయిగాం బౌద్ధ స్తూప ప్రాధాన్యత స్పష్టమౌతుంది. ఇంతటి ప్రాచీన చారిత్రక ఆధారమైన బౌద్ధ స్తూపం, రాష్ట్ర రహదారి రోడ్డు నిర్మాణంలో, కాంట్రాక్టర్ అయిన ఇర్కాన్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సంస్థ నిర్లక్ష్యానికి అనవసరంగా, అకారణంగా బలియై, 1999 డిసెంబర్ 25వ తేదీన నేల కూల్చ బడింది. ఆ తర్వాత ముక్కలైన ఆ స్తూప పలకలను చేర్చి, జిల్లా కేంద్ర పురావస్తుశాఖ మ్యూజియంలో భద్రపరిచి, తిరిగి స్థాపించడం జరిగింది. తత్ఫలితంగా పాశాయిగాంకు చెందిన బౌద్ధ స్తూపం, కనుమరుగై ఈ ప్రాంతం, చరిత్ర పుటల్లో నుంచి తొలగించబడి, ప్రాచీనత్వాన్ని కోల్పోయింది. అలాగే జూలపల్లి మండలంలోని క్రీస్తు పూర్వపు రెండవ శతాబ్ధికి చెందిన హుస్సే నియా వాగు – చిన్న వాగుల సంగమ స్థానంలో 47 శిల్పాలంకృత పలకలచే శోభితమై, ఐదు పడగల "ముచి లింద నాగం" బోధివృక్షం మహాభినిష్క్రమణం చెక్కబడిన దూళికట్ట స్థూపం విశేష ప్రాధాన్యతను కలిగి ఉంది. "కాల చక్ర నిర్వహణ"కై దూళికట్ట నుండి అపురూప ఫలకాలను, అమరావతికి కొద్దికాలం క్రితం తరలించారు. కోటిలింగాల ధూళికట్ట మరియు మీర్జంపేట మానేరు తీరాన చారిత్రక శిల్పాలను, స్తూపాలను, కోటలను, పరి రక్షించేందుకు నాటి రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన 38 లక్షలకు పైగా నిధులు అర్ధాంతరంగా మళ్లించ బడినాయి. ప్రాచీన కట్టడాలు, బౌద్ధ స్థూపాలు, ఆరామాలు, శిల్పీకరించిన అపురూప కళాకృతులు, ఈనాటి వారికి ప్రధానంగా చరిత్ర అంటే గౌరవం లేని సరైన అవగాహన లేని, పాలక అధికార వర్గాలకు తెలియక పోవచ్చు కాని, వాటి ప్రాశస్త్యానికి, వేల సంవత్సరాల వెలకట్టలేని, చారిత్రక నేపథ్యం ఉందన్న యతార్థాన్ని విస్మరించ రాదు. ఒకవైపు ప్రాచీనమైన బౌద్ధ వ్యాప్తికి సంబంధించిన, ఈ ప్రాంత చరిత్ర మరుగున పడుతుండగా... మరోవైపు ప్రాచీనత్వానికి ఆనవాళ్లు అయిన, అపురూప చారిత్రక సాక్ష్యాలను కనుమరుగు చేస్తుంటే, వారి ఆత్మ ఘోష వినిపిస్తుంటే, భారతీయ పురాతత్వ విభాగం ప్రపంచ పౌరుల ముందు తలదించుకోవాల్సిన దుస్థితి. గొప్పలు చెప్పుకోవడం కాదు గొప్పలు నిలబెట్టుకోవడమే గొప్ప తనం.

# ప్రథమ స్వాతంత్ర్య సమరయోధురాలు



ఆధునిక భారతదేశ చరిత్రలో బ్రిటిష్ వలస పాలన, విధానాలకు వ్యతిరేకంగా జరిగిన గొప్ప చారిత్రక సంఘటనే '1857 సిపాయిల తిరుగుబాటు'. బ్రిటిషు ఈస్ట్ ఇండియా కంపెనీ... బెంగాలు నవాబు, ఆయన ఫ్రెంచి మిత్రుల కూటమికి 1757 జూన్ 23న ప్లాసీ నిర్ణయాత్మక యుద్ధం జరగగా, తర్వాత వందేళ్లకు ఈ తిరుగు బాటు చోటు చేసుకుంది. దీనినే 'ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామం', 'సిపాయిల పితూరి', 'విప్లవోద్యమం'గా చరిత్రకారులు అభివర్ణించారు. వీరసావర్కర్ తాను రచించిన గ్రంథం ఇండియన్ వార్ ఆఫ్ ఇండిపెండెన్స్ లో సిపాయిల తిరుగుబాటు ప్రథమ స్వాతంత్ర్య సమరమని పేర్కొనడం జరిగింది. ఉత్తర, మధ్య భారత దేశంలో బ్రిటిషు ఈస్ట్ ఇండియా కంపెనీకి వ్యతిరేకంగా జరిగిన మొదటి భారత స్వాతంత్ర్య యుద్ధం వైఫల్యంతో ముగిసింది. 1857 మే 10న మీరట్లోని బెంగాల్ అశ్విక దళంలో కొందరు సైనికులు ఢిల్లీ వైపు రావడంతో ప్రారంభమైన తిరుగుబాటు, వేగంగా ఉత్తర భారతం మొత్తానికి నిస్తరించింది. మీరట్, ఝాన్సీ, కాన్పూర్, లక్నోలు తిరుగుబాటు తలెత్తిన ముఖ్య ప్రాంతాలు. ఉత్తర భారత దేశ రాజ్యమైన ఝాన్సీ అనే రాజ్యానికి రాణి. 1857లో ఆంగ్లేయుల పరిపాలనకు వ్యతిరేకంగా జరిగిన మొదటి భారత స్వాతంత్ర్య సంగ్రామంలో ప్రముఖ పాత్ర పోషించింది. భారత దేశంలోని బ్రిటిష్ పరిపాలనలో ఝాన్సీ కీ రాణి గ ప్రసిద్ధికెక్కినది. 1857 లో భారత దేశ తిరుగుబాటు దార్లలో ముఖ్యమైన వాళ్ళలో ఆమె ముఖ్యమైనది. ఝాన్సీ లక్ష్మీబాయి అసలు పేరు మణికర్ణిక. ఆమె 1828వ సంవత్సరం నవంబరు19 న మహారాష్ట్ర కు చెందిన సతారలో ఒక కర్హాడీ బ్రాహ్మణుల వంశంలో వారణాసిలో విక్రమ నామ సంవత్సరం బహుళ పంచమీ నాడు జన్మించింది. లక్ష్మీబాయికి 13 ఏళ్ళ వయసు లోనే 1842లో ఝాన్సీ పట్టణానికి రాజైన గంగాధరరావు నెవల్కార్ తో వివాహమైంది. దీంతో ఆమె ఝాన్సీ పట్టణానికి మహారాణి అయింది. అప్పటి ఆచారాల ప్రకారం మహారాణి అయిన తర్వాత ఆమె పేరు లక్ష్మీబాయి అయింది. 1851లో లక్ష్మీబాయికి ఒక కుమారుడు జన్మించాడు. అయితే ఆ పిల్లవాడు నాలుగు నెలల వయసులోనే కన్ను మూశాడు. 1853 లో గంగాధర రావుకు అనారోగ్యం సోకింది. వేరే బిడ్డను ఎవరినైనా దత్తత తీసుకోమని అందరూ సలహా ఇచ్చారు. దాంతో ఆయనకు దూరపు బంధువైన వాసుదేవ నేవల్కర్ కుమారుడైన దామోదర్ రావు అనే పిల్లవాడిని చని పోవడానికి కేవలం ఒక్క రోజు ముందుగానే దత్తత తీసుకున్నారు. 1853, నవంబర్ 21 వ తేదీన గంగాధర రావు మరణించాడు. హిందూ సాంప్రదాయం ప్రకారం దామోదర్ రావు రాజ్యానికి వారసుడు కావల్సి ఉన్నా బ్రిటీష్ ప్రభుత్వం అందుకు అంగీకరించ లేదు. దామోదర్ రావు రాజా కు రక్త సంబంధం కానందు వలన అంటే దత్త సంబంధం కావున, ఈస్ట్ ఇండియా కంపనీ గవర్నర్ జనరల్ లార్డ్ డల్ హౌసి, సిద్ధాంతం ప్రకారం రావు సింహాసనాన్ని అధిష్టించే అధికారం లేదని అతనిని నిరాకరించాడు. రాణి ఝాన్సీని ఇవ్వకూడదని నిశ్చయించుకొన్నది. ఆమె తన సైన్యాన్ని బలపర్చి, తమకు తాముగా వచ్చిన వాళ్ళను పోగుచేసి ఒక సేనను తయారు చేసింది. మహిళలకు కూడా యుద్ధ శిక్షణ ఇవ్వబడింది. యుద్ధ వీరులైన గులాం గాస్ ఖాన్, దోస్త్ ఖాన్, ఖుదా బక్ష్, లాల భు బక్షి, మోతీ బాయి, సుందర్ – ముందర్, ఖాసి బాయి, దీవాన్ రఘునాథ్ సింగ్, దీవాన్ జవహర్ సింగ్ రాణి బలగంలో ఉన్నారు. అలా జరిగిన యుద్ధంలో లక్ష్మీబాయి 1858 జూన్ 17 న గ్వాలియర్ లో యుద్ధ సమయములో మరణించింది. గ్వాలియర్ యుద్ధం గురించి జనరల్ రోస్ ప్రస్తావిస్తూ విప్లవ కారుల్లోకెల్లా ఆమే అత్యంత ధైర్య సాహసాలతో పోరు సల్పిందని కితాబిచ్చాడు. ఆమెకున్న ధైర్యము, పరా క్రమము, వివేకము, భారత దేశంలో 19 వ శతాబ్దములో మహిళలకున్న అధికారం పై ఆమెకున్న ముందుచూపు, ఆమె చేసిన త్యాగాలు ఆమెను స్వాతంత్ర్య పోరాటంలో ఒక ప్రసిద్ధ వ్యక్తిగా నిలిపింది. "జోన్ ఆఫ్ ఆర్క్" లాగా ఆమె భారత దేశ చరిత్రలో ఒక గొప్ప వ్యక్తిగా నిలిచిపోయింది.

# మహిళల హక్కుల పై ప్రతి ఒక్కరు పోరాడాలి...

### మహిళ సాధికారత కేంద్రం జనరల్ స్పెషలిస్ట్ శ్రీవాణి, సలోమి

**అగ్ని ధార న్యూస్ వనపర్తి జిల్లా :** మహిళల హక్కులపై ప్రతి ఒక్కరు పోరాడాలని మహిళలకు ఎలాంటి అన్యాయం జరిగిన మహిళ సాధికారత కేంద్రం అండగా ఉంటుందని మహిళ సాధికారత కేంద్రం జనరల్ స్పెషలిస్ట్ శ్రీవాణి అన్నారు.సోమవారం పెబ్బేరు మున్సిపాలిటీలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పెబ్బేరు పట్టణ కేంద్రంలో మహిళ సాధికారత కేంద్రం,సభ్యులు మహిళా సంఘాల సభ్యులతో సంయుక్తంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సఖి కేంద్రం సేవలు, మహిళ సాధికారత, మహిళ చట్టాలు గృహ హింస చట్టం, పని చేసే చోట లైంగిక వేదింపులు చట్టం, బాల్య వివాహాలు, పలు పథకాల గురించి కార్యక్రమంలో అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా మహిళ సాధికారత కేంద్రం జనరల్ స్పెషలిస్ట్ శ్రీవాణి మాట్లాడుతూ బాల్య వివాహాలు అరికట్టాల్సిన బాధ్యత మహిళా సంఘాల సభ్యులకు మరియు అందరికీ బాధ్యత ఉందని అన్నారు.బాల్య వివాహాలతో ఎన్నో దుష్పరిణామాలు సంభవిస్తాయని చెప్పారు. చిన్నతనంలో గర్భం దాల్చడం వల్ల ఒక్కోసారి తల్లి ప్రాణాలకు ముప్పుగా మారుతుందన్నారు.ఈ కార్యక్రమంలో మహిళ సాధికారత కేంద్రం సభ్యులు సలోమి,రాధా,మహిళా సంఘం నాయకురాలు అక్కల జ్యోతి ,బ్యాంకు మేనేజర్ శ్రావణ్,ఫీల్డ్ ఆఫీసర్ నోవా పాల్గొన్నారు.



# పాలమూరు బిడ్డ అని చెప్పుకుంటూ పాలమూరు అభివృద్ధిని పడుకోబెట్టాడు

### తట్టెడు మట్టి తీయకుండా తాతకు దగ్గు నేర్పే సీఎం

### మాజీమంత్రి సింగిరెడ్డి రంజన్ రెడ్డి

**అగ్ని ధారన్యూస్ వనపర్తి జిల్లా :**పాలమూరు బిడ్డ అని చెప్పుకుంటూ పాలమూరుకు పారే నీటిని సీఎం రేవంత్ రెడ్డి అడ్డుకున్నాడని తట్టెడు మట్టి తీయడం చేతకాదు తాతకు దగ్గు నేర్పే తట్టు మాట్లాడుతాడు మన సీఎం అని ఘాటైన మాటలతో మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి సోమవారం నిర్వహించిన పత్రిక సమావేశంలోఅన్నారు.లగచర్ల భూసేకరణ, నీటి తరలింపు, సీఎం వరంగల్ పర్యటన,తెలంగాణ లో పండుతున్న పంటల పై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటనల పై మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి

సీఎం పాలమూరు బిడ్డను అని చెప్పుకుంటూ ప్రాజెక్ట్ ను పదకొండు నెలలు పడుకోబెట్టిండు...కొడంగల్ ఫార్మా సిటీ కి బీమా నుండి ఏడు టీఎంసీ నీళ్లను తరలించడానికి ప్రభుత్వం ప్రత్తిపాదనలు సిద్ధం చేసింది..పాలమూరు ప్రజల నోట్లో మట్టి కోట్టినట్లే అవుతుంది..దేవరకద్ర, మక్తల్, వనపర్తి, కొల్లాపూర్ ప్రాంతాలకు ఇది గొడ్డలి పెట్టు...బి ఆర్ ఎస్ ప్రభుత్వం ముచ్చర్ల దగ్గర ఫార్మా సిటీ కోసం పద్నాలుగు వేల ఎకరాలు సేకరించింది.. ఫార్మా సిటీ కి గోదావరి నీళ్లను తరలించాలని ప్రతిపాదించాము.ఇది పక్కన పెట్టి కొడంగల్ లో వద్దన్న చోట ఫార్మా సిటీ పెడతాం అంటున్నారు..ఇది కాంగ్రెస్ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయం..మూర?పు చర్య..రైతులను బెదిరించి, భయపెట్టి, బలవంతంగా భూ సేకరణ చేస్తుంది..మళ్ళీ ఫార్మా సిటీ కోసం ఉన్న కొద్ది కృష్ణ నీళ్లను వాడుకోవాలని చూస్తుంది..



పాలమూరు బిడ్డగా చెప్పుకునే రేవంత్ కొత్తగా అదనంగా నీళ్లు ఇచ్చే పని చేయకుండా...ఉన్న నీళ్లకు గండి కొడుతున్నారు.

దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం.పాలమూరు రైతుల ప్రయోజనాలు దీర్ఘాలికంగా దెబ్బ తింటాయి.ఏడాది కాలంగా ఒక్క టీఎంసీ ఇచ్చే పనులు చేపట్టలేదు..పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ పూర్తి చేసి ఉంటే ఈ ఏడాది ఒక అరవై శాతం నీళ్లు ఇచ్చే అవకాశం ఉంటుండే...తట్టేడు మట్టి తీయలేదు.. ఒక్క రూపాయి ఖర్చు పెట్టలేదు...కాళేశ్వరం నీళ్ళే రాలేదు అని ఎగతాళి చేసుకుంటూ... అబాండాలు వేసుకుంటూ కాలయాపన చేస్తున్నారు..కాళేశ్వరం నీళ్లు లేకపోతే హల్దీవాగు, రిజర్వాయిర్ లకు నీళ్లు ఎట్లా వచ్చాయి..కాళేశ్వరం నీళ్లతో పండించిన రైతులకు తెలియదా?తెలంగాణ లో వ్యవసాయ ఉత్పత్తులు దేశంలో లో నెంబర్ కి ఎలా వచ్చాయి...?పెండింగ్ ప్రాజెక్ట్ లు నిర్ధిష్ట కాలపరిమితి పెట్టుకుని బి ఆర్ ఎస్ ప్రభుత్వం పూర్తి చేసింది.వాటితో పాటు పాలమూరు రంగారెడ్డి లాటి కొత్త ప్రాజెక్ట్ లను ప్రభుత్వం చేపట్టి 90 శాతం పూర్తి చేసింది..భారీ వాగుల మీద 1000 పైగా చెక్ డ్యామ్ లు నిర్మించాము..ఎండాకాలం లో కూడా చెక్ డ్యామ్ లు అలుగు పారుతున్నాయి.ప్రవాహం ద్వారా వచ్చే నీటిని నిల్వ చేసే పని చేయలేదు..సమైక్య పాలనలో చెరువులు, కుంటలను ఎట్లా విధ్వంసం చేసారో పుస్తకాలు రాసారు..తెలంగాణ అందుకే బోర్ల మీద ఆధార పడే వ్యవస్థ వచ్చింది...బి ఆర్ ఎస్ ప్రభుత్వం చెరువులు, కుంటలు మిషన్ కాకతీయ ద్వారా బాగు చేసాం..కాళేశ్వరం, సీతరామ, పాలమూరు రంగారెడ్డి తో పాటు అనేక చిన్న తరహా ప్రాజెక్ట్ లు చేపట్టాము.ఇవాళ కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ అగ్రగామి పంటలు పండుతున్నాయి అని చెప్తుంది.మీ వల్ల... మీ పని తీరు వల్ల పెరిగాయా?గత ప్రభుత్వం పదేళ్ళ చర్యలతోనే ఇవాళ తెలంగాణ లో పెద్ద ఎత్తున పంటలు పండుతున్నాయి.నీటి పారుదల వ్యవస్థ కెసిఆర్ బలోపేతం చేశారు.వరంగల్ రైతు డిక్లరేషన్ లో ప్రకటించిన ఏ ఒక్క అంశం కాంగ్రెస్ పార్టీ చేయలేదు..రైతు డిక్లరేషన్ ప్రకటించిన వరంగల్ కి రేపు ముఖ్యమంత్రి పోతున్నాడు..రుణమాఫీ సగానికంటే తక్కువ చేసింది... 36 వేల కోట్లకు గాను... 17 వేల కోట్లు చేసింది.. లెక్కలే చెప్తున్నాయ్..

రైతు భరోసా లేదు.. కెసిఆర్ ఇచ్చిన రైతు బంధు కూడా లేదు...రుణమాఫీ పై ఓట్లు, తిట్లు, భూతులు, శాపనార్థాలు అయిపోయాయి...కౌలు రైతులకు పన్నెండు వేలు లేదు..కాళోజి కాలక్షేత్రం ప్రారంభోత్సవం కి సీఎం రేవంత్ పోతున్నాడు. కాంగ్రెస్ ప్రభుత్వం కి నైతికత ఉందా?కాళోజి పేరు ఎత్తే అర్హత కాంగ్రెస్ పార్టీ కి లేదు.. జీవితకాలం కాంగ్రెస్ పార్టీ మీద పోరాటం చేసి స్ఫూర్తి నింపిన మహనీయులు కాళోజి...వరంగల్ నుండే రైతుల తిరుగుబాటు ప్రారంభం అవుతుంది..అన్ని వర్గాల ప్రజలు ప్రభుత్వం పై అసంతృప్తి గా ఉన్నారు...

# నేతకానిల ఆత్మ గౌరవ సభను జయప్రదం చేయండి



### నేతకాని మహర్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు దుర్గం రాజేష్

**అగ్ని ధార న్యూస్,( మంచిర్యాల):** ఈనెల 23న మంచిర్యాలలోని వైశ్య భవన్ లో జరిగే నేతకానిల ఆత్మగౌరవ సభను జయప్రదం చేయాలని నేతకాని మహర్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు దుర్గం రాజేష్ పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జన కుల గణన సర్వేలో భాగంగా నిర్వహిస్తున్న సర్వే ఫామ్ లో నేతకాని కులం నెంబర్ 40 లో నేతకానికి బదులు నేథానిగా ప్రింట్ రావడంతో యావత్ నేతకాని సమాజం అంతా అప్రమత్తమై ముక్తకంఠంతో నేథానిని నేతకానిగా సవరించాలని ఆయా జిల్లాల కలెక్టర్లకు, ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలకు వినతి పత్రాలు అందజేయడం జరిగిందని పేర్కొన్నారు. వెంటనే మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు లు స్పందించి సీఎం దృష్టికి తీసుకెళ్లి నేథానిని నేతకనిగా సవరణ చెపిస్తే దాన్ని చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి తానే మార్చినట్లు తన ఖాతాలో వేసుకొని తన పేపర్లో రాయించుకున్నాడని ఆరోపించారు. నేతకాని కులాన్ని మాల ఉపకులంగా చెప్పుతూ నేతకాని కులస్తుల రిజర్వేషన్లు అనుభవిస్తున్న వివేక్ కుటుంబం ఆటలు ఇక చాలవు అని హెచ్చరించారు. నేతకాని కులం ఎవరికి ఉపకులం కాదని, తమ కులానికి ప్రత్యేకత ఉందని ఇన్నాళ్లు అభివృద్ధికి నోచుకోని నేతకాని కులాన్ని ఎస్సీ జాబితాలోని ఏ కేటగిరీలో చేర్చి రిజర్వేషన్ శాతం పెంచి ,జనాభా ధామాషా ప్రకారం నేతకానిలకు హక్కులు , రిజర్వేషన్లు వర్తింపచేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో నేతకాని మహర్ సంక్షేమ సంఘం ముఖ్య సలహాదారు బోర్లకుంట దీపక్ కుమార్, పోలీస్ బ్యూరో చైర్మన్ రాజేష్, రాష్ట్ర అధికార ప్రతినిధి గోల్లె రాయమల్లు, రాష్ట్ర ఉపాధ్యక్షులు కామెర ప్రకాష్, రాష్ట్ర యువజన అధ్యక్ష కార్యదర్శులు అనపర్తి యువరాజ్, దుర్గం సంతోష్, రాష్ట్ర నాయకులు గోలేటి లక్ష్మి, కామెర శ్రీనివాస్ బెంబడి గురువయ్య ముడిమడుగుల శ్రీనివాస్, నేతకాని స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జుమ్మిడి గోపాల్, మంచిర్యాల జిల్లా ఇన్చార్జి సునార్ కార్ రాంబాబు, జాడి రమేష్ దాగం కుమార్, గోగు కిష్టయ్య తాటిపల్లి నరేష్ గోగు మల్లేష్ దుర్గం శంకర్ తదితరులు పాల్గొన్నారు

# సీనియర్ జర్నలిస్టు దినేష్ కు. మాత్రు మూర్తి వియోగం



### నివాళులు అర్పించిన మద్దెల దినెష్.

**అగ్ని ధార న్యూస్ ,(రామగుండం):** గోదావరిఖని సీనియర్ జర్నలిస్టు, మిత్రుడు శ్రీ వడ్డెపెల్లి దినేష్ మాతృ మూర్తి కీ.శే.రాజ్యలక్ష్మి అనారోగ్యంతో మరణించిన విషయం తెలిసి, సోమవారం వారి ఇంటికి వెళ్ళి ఆమె పార్థీవ దేహం పై పూలమాల వేసి నివాళులు అర్పించిన దళిత హక్కుల పోరాట సమితి పెద్దపల్లి జిల్లా కన్వీనర్ కామ్రేడ్ మద్దెల దినెష్. రాజ్యలక్ష్మి మృతి బాధాకరం మని, ఆమె కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేస్తూ సంతాపం తెలిపారు. ఇంకా పరామర్శించిన వారిలో ఏఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి ఆఫీసు కార్యదర్శి తొడుపునూరి రమేష్ కుమార్ తో పాటు తదితరులు ఉన్నారు.

# జనగామలో మెగా వైద్య శిబిరం




**అగ్నిధారన్యూస్ గోదావరిఖని :** సోమ వారం రోజున జనగామ గ్రామంలోని జనగామ యాదవ సంఘం అధ్యక్షులు గుండబోయిన భూమయ్య, సంఘం పెద్దల ఆధ్వర్యంలో మెడి కవర్ హాస్పిటల్ కరీంనగర్ వారి సౌజన్యం తో మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది. ఈ వైద్య శిబిరం కు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు వారికి సంబందించిన దీర్ఘకాలిక వ్యాధులు మరియు వారికి ఉన్న అనారోగ్య సమస్యలు డాక్టర్ల కు వివరించగా ప్రతి ఒక్కరికి బీపీ షుగర్, ఈ సి జి పరీక్షలు, నిర్వహించడం జరిగింది. ఇంకా అవసరం ఉన్నవారికి టెస్ట్ లు పరీక్షలు తెల్ల రేషన్ కార్డు ఉన్నవారికి కరీంనగర్ లో ఉచిత వైద్య పరీక్షలు చేస్తారు అని అక్కడికి వచ్చిన ప్రజలకు చెప్పటం జరిగింది.. ఈ కార్యక్రమం లో యాదవ్ సంఘం పెద్దలు గుండబోయిన వెంకటి, అర్కుటి శంకర్, ఎర్ర మల్లన్న, గుండెబోయిన భూమయ్య, గుండెబోయిన సదానందం,గుండెబోయిన గట్టయ్య ,ఆరుకుటి రాజయ్య, పైడిద రాజు, గుండెబోయిన సంతోష్ వివిధ పార్టీల నాయకులు తోకల రమేష్, జనగామశివ, ఆకుదారి కత్తెరసాల,జనగామ బద్రి,ఇరుగురాల శివ, జనగామ శివరామకృష్ణా, కాదాసి శంకర్ మరియు గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు..

# ధాన్యం తూకాల్లో తేడా ఉంటే కఠిన చర్యలు



### వనపర్తి జిల్లా తూనికలు కొలతల శాఖ అధికారి సత్యనారాయణ

**అగ్ని ధార న్యూస్ వనపర్తి జిల్లా :** ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిర్వాహకులు తూకంలో అవకతవకలకు పాల్పడిన, డిపార్ట్మెంట్ వారిచే ముద్ర వేసిన ధర్మకాంటాలను వాడకపోయినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని వనపర్తి జిల్లా తూనికలు కొలతల శాఖ అధికారి సత్యనారాయణ హెచ్చరించారు. సోమవారం మదనాపురం మండల పరిధిలోని నెలివిడి, గోపన్పేట్ PACS కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ధాన్యం తూకంలో ఒక కేజీ తేడా రావడంతో నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. జిల్లాలోని కొనుగోలు కేంద్రాలలో ధాన్యం తూకంలో తేడా ఉన్నట్లు గుర్తిస్తే రైతులు వెంటనే సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కొనుగోలు కేంద్రాల నిర్వహకులు రైతులను మోసం చేయొద్దని సూచించారు.

# గుర్తు తెలియని వాహనం ఢీకొని ఇద్దరు మృతి



**అగ్ని ధార న్యూస్ (ఆమనగల్లు):**ఆమనగల్లు మండలం చింతలపల్లి గ్రామ సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని ఇద్దరు వ్యక్తుల దుర్మరణం పాలైన సంఘటన చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం ఆమనగల్లు మండలం మంగళపల్లి చెన్నకేశవ కాలనీకి చెందిన వరికుప్పల యాదగిరి (45) మర్ల యాదయ్య (42) ఆమనగల్లు నుండి షాద్నగర్ వెళ్లే రహదారి పై చుక్కాపూర్ సమీపంలోని ఫంక్షన్ హాల్ లో బంధువుల వేడుకకు హాజరు కావడానికి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా చింతలపల్లి సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాలను పోస్ట్ మార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నామని ఆమనగల్లు ఎస్సై వెంకటేష్ తెలిపారు.

# ఎక్సైజ్ సూపరిండెంట్ కు ఆర్ఆర్ వైన్స్ పై ఫిర్యాదు

### బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి – పోతరవేని క్రాంతి

**అగ్నిధార న్యూస్ మంథని :** గత శుక్రవారం మంథని మున్సిపాలిటీలో గల ఆర్ఆర్ వైన్స్ లో జరుగుతున్న నిర్లక్ష్యాలపై నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న యాజమాన్యం తీరుపై మంథని ఎక్సైజ్ శాఖ సిఐ కి కంప్లైంట్ ఇవ్వటం జరిగింది.దానికి కొనసాగింపుగా సోమవారం పెద్దపల్లి జిల్లా ఎక్సైజ్ సూపరిండెంట్ మహిపాల్ రెడ్డిని కలిసి సమగ్ర విచారణ చేపట్టి షాప్ యాజమాన్యంపై తగిన రీతిలో చట్టపరమైన చర్యలు తీసుకొని ఆర్ఆర్ వైన్స్ ను సీజ్ చేయవలసిందిగా ఫిర్యాదు చేయడం జరిగింది.ఈ విషయంపై వారు సానుకూలంగా స్పందించి త్వరగా విచారణ చేపట్టి దోషులుగా తేలితే వారిపై చట్టపరంగా తగు విధమైన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.ఈ విషయంపై త్వరలో హైదరాబాద్ లోని బాలల సంక్షేమ కార్యాలయంలో కూడా ఫిర్యాదు చేయనున్నామని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి పోతర వేణి క్రాంతి కుమార్ తెలిపారు.

# హెచ్.ఆర్.సి.ఐ జిల్లా ఉమెన్ పోర్ట్ వెల్ఫేర్ సెక్రటరీ గా జాగటి శాంతమ్మ



**అగ్నిధార న్యూస్, (రామగుండం):** ఎన్టిపిసి అన్నపూర్ణ కాలనీ చెందిన జగటి శాంతమ్మను పెద్దపల్లి జిల్లా ఉమెన్ పోర్ట్ వెల్ఫేర్ సెక్రటరీగా నియమించినట్లు హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫర్ ఇండియా పెద్దపెల్లి జిల్లా అధ్యక్షులు కొండల రాజేందర్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేషనల్ చెర్మన్ చెన్నూపాటి శ్రీకాంత్, నేషనల్ జనరల్ సెక్రటరీ నందం నర్సిములు అడిష్నల్ జనరల్ సెక్రటరీ మాదాసు చారేంద్రలు జాగటి శాంతమ్మ చేసే ప్రజా పోరాటాలను గుర్తించి వారికి పెద్దపల్లి జిల్లా ఉమెన్ పోర్ట్ వెల్ఫేర్ సెక్రటరీగా నియమించాలని ఆదేశించినట్లు తెలిపారుఈ సందర్భంగా శాంతమ్మ మాట్లాడుతూ తనపై నమ్మకంతో పదవి బాధ్యతలు అప్పగించిన, సహకరించిన జాతీయస్థాయి నాయకులకు స్టేట్ డిస్టిక్ ప్రెసిడెంట్ కొండల రాజేందర్ కుమార్ కి కృతజ్ఞతలు తెలిపారు. –సమస్య మీది పరిష్కారం మాది–అంటూ దళిత పిడిత పేద బలహీన ప్రజల అణగారిన కులాల వారికీ అగ్రవర్ణ కులల లో ఉండబడే పెద ప్రజలకు నిస్వార్థం గా పనిచేస్తానన్నారు.మానవహక్కుల ఉలంగాణ లేని సమాజం కోసం అహర్నిశలు కష్టపడతానన్నారు.ఏంతటివరైనా వారు ఏ హొదాలో వున్నా కూడా అన్యాయం జరిగితే సాహించేదిలేదన్నారు.ప్రజా సమస్యల పట్ల బాధ్యతతో పనిచేస్తానని తెలియజేశారు .

## ఐఎన్టియూసి కేంద్ర కమిటీ కార్యదర్శిగా గడ్డం తిరుపతి యాదవ్



**అగ్నిదారన్యూస్ గోదావరిఖని:** సింగరేణి కోల్ మెన్స్ లేబర్ యూనియన్ (ఐఎన్టియూసి) కేంద్ర కమిటీని ఐఎన్టియూసి జాతీయ అధ్యక్షులు డాక్టర్ జి సంజీవరెడ్డి 135మందితో ప్రకటించగా ఆర్జీ3 ఏరియాలో ఆరుగురికి అవకాశం ఇవ్వడం జరిగింది. ఇందులో రామగుండం 8వ కాలనీకి చెందిన సింగరేణి ఆర్జీ3 ఓసి1 లో ఈపి ఆపరేటర్ గా పనిచేస్తున్న గడ్డం తిరుపతి యాదవ్ ని సెంట్రల్ కమిటీ కార్యదర్శిగా నియమించడం జరిగింది. గడ్డం తిరుపతి యాదవ్ గత 31 సంవత్సరాలుగా వివిధ హోదాలలో ఐఎన్టియూసి మరియు కాంగ్రెస్ పార్టీలో చురుకుగా పనిచేస్తూ సేవలందించగా ఈ కమిటీలో వారికి కేంద్ర కమిటీ కార్యదర్శిగా నియమించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ నియామకం పట్ల గడ్డం తిరుపతి యాదవ్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఐఎన్టియూసి కేంద్ర కార్యదర్శిగా నియమించిన జాతీయ అధ్యక్షులు సంజీవరెడ్డికి,ఐటీ శాఖ మంత్రివర్యులు దుద్దిల్ల శ్రీధర్ బాబుకి, ఐఎన్టియుసి సెక్రెటరీ జనరల్ ప్రసాద్ సహకరించిన ఐఎన్టియూసి నాయకులు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.

## నెరవేరిన చిరకాల కోరిక ...



**అగ్నిధార న్యూస్, మేడిపల్లి మండలం, నవంబర్ 18:** జగిత్యాల జిల్లా పరిధిలోని మేడిపల్లి మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరు చేస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం రోజున జీవోను విడుదల చేసింది.గత ప్రభుత్వ హయాంలో జూనియర్ కళాశాల కోసం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అనేక ఆందోళన కార్యక్రమాలు చేపట్టడం జరిగింది. మండల కేంద్రంతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు జూనియర్ కళాశాల లేక అనేక ప్రాంతాలకు వెళ్లడం వలన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మేడిపల్లి మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయడం వల్ల విద్యార్థిని విద్యార్థులకు దూర భారం తగ్గుతుందని ఆనాడు ఆది శ్రీనివాస్ అనేక పోరాటాలు చేశారు. గత శాసనసభ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిస్తే మండల కేంద్రానికి జూనియర్ కళాశాల మంజూరు చేపిస్తానని ఇచ్చిన హామీ ఇచ్చారు. అప్పటి హామీని నెరవేరుస్తూ జూనియర్ కళాశాల మంజూరు చేస్తూ ఇప్పటి తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.జూనియర్ కాలేజీ మంజూరు చేయడం పట్ల ప్రజలు విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు . జూనియర్ కళాశాల మంజూరికి కృషి చేసిన ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కు ఈ సందర్భంగా మండల కేంద్రంతో పాటు చుట్టుపక్క గ్రామాల ప్రజలు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## పేద ప్రజలు వరం ముఖ్యమంత్రి సహాయనిధి



### ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** తలకొండపల్లి మండలం వెంకటాపూర్ గ్రామంలో ఆయిల్ లక్ష్మమ్మ భర్త వెంకటయ్య గౌడ్ అనారోగ్యంతో మెరుగైన వైద్యం కోసం ప్రైవేటు హాస్పిటల్లో చికిత్స పొందడం జరిగింది ఆర్థిక ఇబ్బందుల వలన ముఖ్యమంత్రి సహాయనిధి కోసం దరఖాస్తు చేసుకోవడం జరిగింది స్థానిక శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో 23,000 రూపాయలు మంజురు కావడం తో చెక్కును గ్రామ మాజీ సర్పంచ్ పయ్యావుల రమేష్ యాదవ్ స్థానిక నాయకులతో కలిసి బాధిత కుటుంబానికి అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో, సోప్పరి శీను, పబ్బతి వెంకటయ్య, సొప్పరి చిన్న జంగయ్య, వడ్డే శ్రీను, సోప్పరి శ్రీను, ఏ శ్రీకాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

### మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్ రెడ్డి

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** తలకొండపల్లి మండలం వెంకటపూర్ గ్రామానికి చెందిన పోతుల నర్సింహా అనారోగ్యంతో వృద్ధాప్యంతో మరణించడం జరిగింది. గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్ రెడ్డి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ 3,000 రూపాయలు వారి తో పాటు అయిల్ సత్యనారాయణ గౌడ్ 1000 రూపాయలు ఆర్థిక సహాయం స్థానిక కాంగ్రెస్ నాయకులు ద్వారా అందజేశారు. ఈ కార్యక్రమంలో ,గ్రామ మాజీ సర్పంచ్ పయ్యవుల రమేష్ యాదవ్, వెల్జాల్ ఉపసర్పంచ్ అజీజ్ గారు దేవాలయ కమిటీ వైస్ చైర్మన్ అంజన్ రెడ్డి మాజీ వార్డు సభ్యులు శ్రీను ,రాము, ఆంజనేయులు, నాయకులు ఢిల్లీ లక్ష్మీనారాయణ, లక్ష్మయ్య ,ఎల్లయ్య,శేఖర్, ఆంజనేయులు,అయిల్ శ్రీకాంత్ గౌడ్ పబ్బతి రాజు సొప్పరి సంతోష్, సొప్పరి పెద్ద జంగయ్య గుంటి పాండు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# ఢిల్లీలో దోస్తీ - గల్లీలో కుస్తీ

### బీజేపీ - బీఆర్ఎస్ నాయకులది
### మహారాష్ట్రలో గెలిసేది కాంగ్రెస్ పార్టీనే
### మంత్రి పొన్నం ప్రభాకర్

**అగ్నిధారన్యూస్,( రామగుండం) :** మహారాష్ట్రలో గెలిచేది కాంగ్రెస్ పార్టీయే నని మంత్రి పొన్నం ప్రభాకర్ ధీమా వ్యక్తం చేశారు. సోమవారం రామగుండం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రామగుండం ఎమ్మెల్యే మక్కాన్సింగ్ రాజ్ ఠాకూర్ ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొని మాట్లాడారు. మాజీమంత్రి కేటీఆర్ మహారాష్ట్ర ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయద్దు అంటున్నారు అంటే బీజేపీకి ఓటు వేయు అంటున్నారు. బీజేపి కి దోస్తీ ఎవ్వరు తెలంగాణ లో బి.ఆర్.యెస్ పార్టీయే కదా అని అన్నారు. బి.ఆర్.ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కి అవగాహన ఉందొ లేదో తెలియడం లేదు. ఎందుకంటే పదే పదే కేటీఆర్ గ అక్కారకురాని ఆరోపణలు తరచూ కాంగ్రెస్ పార్టీ మీద చేయడం చేస్తున్నారని అన్నారు .గత 10 సంవత్సరాల బిఆర్ఎస్ ప్రభుత్వం పాలనలో బీజేపీ పార్టీకి తెలంగాణ లో అండదండలు అందించి తెలంగాణ ద్రోహులు మీరు కాదా అని అన్నారు. మహారాష్ట్ర ఎన్నికల సందర్భంగా రాజురా నియోజకవర్గంకు



వెళ్తున్నట్లు చెప్పారు .ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కార్పొరేటర్లు మాజీ కార్పొరేటర్లు వివిధ విభాగాల అధ్యక్షులు తదితరులు ఉన్నారు.

# తెలంగాణ రాష్ట్రంలో పోలీసు రాజ్యం నడుస్తుంది

### బి.ఆర్.ఎస్ ప్రజాప్రతినిధులమీద నాయకులపై కక్షసాధింపు చర్యలు
### మాజీ మంత్రి కోప్పుల ఈశ్వర్

**అగ్నిధారన్యూస్ గోదావరిఖని:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో తెలంగాణ రాష్ట్రం పోలీస్ మయం అయ్యింది.ప్రభుత్వం ఏమి చెబితే పోలీసులు అదే చేస్తున్నారని.

రాష్ట్రంలో ఎన్నడూ చూడని పాలన కాంగ్రెస్ పాలిస్తుందని రాష్ట్రం లో దౌర్జన్యం దమనకాండకొనసాగుతుందని మాజీ మంత్రి కోప్పుల ఈశ్వర్ అన్నారు.సోమవారం గోదావరిఖని ప్రధాన చౌరస్తాలోని టి.బి.జి.కె.ఎస్ కార్యాలయం లో మాజీ మంత్రి కోప్పుల ఈశ్వర్ ,మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి కోప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ...తెలంగాణ రాష్ట్రంలో పోలీసు రాజ్యం నడుస్తుందనిపోలీసులే ప్రభుత్వం అన్నట్టు వ్యవహరిస్తున్నారని అన్నారు. న్యాయాన్ని రక్షించాల్సిన పోలీసులు అన్యాయం వైపు నిలుస్తున్నారన్నారు. రామగుండంలో నలుగురు మహిళా కార్పోరేటర్ల పై పోలీసు ఉన్నతాధికారి అసభ్య పదజాలంతో మాట్లాడడం దారుణమన్నారు. కృష్ణ నగర్ లో డిప్యూటీ మేయర్ పై పెట్రోల్ పోసిన వ్యక్తి పై పోలీసులు కేసు నమోదు చేయలేదని ఫిర్యాదు చేసిన వారిపై ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఉందా లేదా అనే అనుమానాలు వస్తున్నాయన్నారు. రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని తిలక్ నగర్ , లక్ష్మి నగర్, చౌరస్తాలో నిరు పేదల కట్టడాలు అక్రమంగా కూల్చివేశారు. వారి ఎలాంటి ప్రత్యామ్నాయ మార్గాలు చూపకుండా వారి జీవితాలను రోడ్డు




పై పడేశారన్నారు. సింగరేణి, మున్సిపల్ అధికారులు ఈ కుల్చివేతలు ఎందుకు చేస్తున్నారో ఎవ్వరి కోసం నూతన కాంప్లెక్స్ నిర్మాణాలు చేస్తురో సమాధానం చెప్పాలన్నారు. బీ ఆర్ ఎస్ కార్పొరేటర్ అనే ఒకే ఒక్క కారణంతో సిరి ఫంక్షన్ హాల్ కూల్చివేశారని హైకోర్టు నుండి స్టే ఆర్డర్ వున్న కుట్రపూరితంగా కూల్చివేశారన్నారు. పోలీసులు నిస్పాక్షపాతంగా వ్యవరించాలి.పోలీసులు పాలకుల అదేశాలను అమలు చెస్తాం అన్న తీరు బాగలేదని రామగుండం లో దౌర్జన్యఖండ నడుస్తుందన్నారు.ఈ విలేఖరుల సమావేశం లో రామగుండం నగర డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్ రావు కార్పోరేటర్లు కల్వచర్ల కృష్ణ వేణీ కుమ్మరి శ్రీనివాస్ రమణారెడ్డి కవిత సరోజిని నాయకులు నడిపెల్లి అభిషేక్ రావు, అంతర్గ%శీ% మాజీ జెడ్పీటీసీ అముల నారాయణ,మేతుకు దేవరాజు, నూతి తిరుపతి, పిల్లి రమేష్ ,బుర్ర శంకర్ గౌడ్, సట్టు శ్రీనివాస్ ,తోకల రమేష్, జడ్సన్ ,అడ్లూరి రాములు , ఇరుగురాళ్ల శ్రావన్ కర్రీ ఓదేలు కొడి రామకృష్ణ,రమ్య యాదవ్,ముద్దసాని సంధ్యారెడ్డి,గుర్రం పద్మ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటి నిర్మాణానికి చేయూత



### చారి ట్రబల్ ట్రస్టు చైర్మన్ ఉప్పల వెంకటేష్

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** మాడుగుల మండలం ఆర్కపల్లి గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన ఏపూల ఎలిసా తండ్రి పేరు మైసయ్య ఇంటి నిర్మాణం కోసం ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ తలకొండ పల్లి మాజీ జడ్పిటిసి వెంకటేష్ తన ట్రస్ట్ ద్వారా సిమెంట్ ,సికులు అందజేయడం జరిగింది. నిరుపేద కుటుంబానికి చెందిన ఏ పుల ఎలిసా కుటుంబ సభ్యులు ఉప్పల వెంకటేష్ కి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో,గణేష్, రాజ వర్ధన్ రెడ్డి, పందుల రమేష్, బంగారు సైదులు, టిఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## అనాధ పిల్లలకు అన్ని విధాలుగా ఆదుకుంటా



### రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి

వెల్దండ మండలం చెర్కుర్ గ్రామానికి చెందిన నిలాం భాగ్యమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించడం జరిగింది.ఈవిషయం తెలుసుకున్న రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి వారి కుటుంబానికి పరామర్శించి,5,000 /- వేల రూపాయలు అందజేసి, భాగ్యమ్మ ఇద్దరు పిల్లలను విద్య, ఆరోగ్య పరంగా,అన్నివిధాలా ఆదుకుంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో, మాజీ ఎంపీటీసీ బీమయ్యా గౌడ్, మాజీ ఉప సర్పంచ్ నర్సింహా,శ్రీనివాస్, మైసయ్య, లాలయ్య, ఆలీ, రాజు, రామరాజు గొడుగు యాదయ్య, రమేష్, జంగయ్య, తదితరులు ఉన్నారు.

## లగచర్లలో జాతీయ ఎస్టీ కమిషనర్ ను కలవకుండా ముందస్తు అరెస్టు



### మాజీ జెడ్పిటిసి దశరథ్ నాయక్

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** లగచర్ల గ్రామంలో ఫార్మ భూసేకరణలో గిరిజనులకు జరుగుతున్న అన్యాయాన్ని పరిశీలించేందుకు జాతీయ ఎస్టీ కమిషనర్ జాలోతు హుస్సేన్ లగచర్లలో పర్యటించనున్నారు. ఈ సందర్భంలో ఎస్టీ కమిషనర్ హుస్సేన్ ను కలవకుండా కడ్తాల్ మాజీ జెడ్పిటిసి జర్పుల దశరథ్ నాయక్ తో పాటు స్థానిక నాయకులను ముందస్తుగా కడ్తాల్ పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ తరలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లగచర్ల గిరిజనులకు అన్యాయం జరుగుతుంటే కళ్ళారా చూస్తూ ఊరుకోలేమని, న్యాయం కోసం ఎస్టీ కమిషనర్ను కలవడానికి బయలుదేరిన తమను అక్రమంగా అరెస్టు చేస్తున్నారని తెలిపారు. తన జాతి జనుల కోసం పోరాడుతుంటే రేవంత్ సర్కార్ అక్రమంగా కేసులు పెడుతుంటే చూస్తూ ఊరుకోలేమని తెలిపారు అలాగే తన జాతి జనులు బాగోగుల కోసం ఎన్నిసార్లైనా జైలుకి వెళ్ళడానికి సిద్ధమని హెచ్చరించారు. ఇప్పటికైనా రేవంత్ సర్కార్ మానుకొని అక్రమంగా అరెస్టు చేసిన గిరిజనులను వెంటనే విడుదల చేసి వారిపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తేయాలని డిమాండ్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో పిఎసిఎస్ డైరెక్టర్ సేవ్య నాయక్, మాజీ సర్పంచ్ హరిచంద్ నాయక్, మాజీ ఉప సర్పంచ్ శారదా పండు నాయకులు, శ్రీను, మహేష్, అంజి ,శ్రీకాంత్, రాజు, జగన్, రాజేష్, భీమన్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలను ఆర్థిక సహాయం

### రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** కడ్తాల్ పట్టణానికి చెందిన తుప్పరి రాజు,మహేష్ టోల్ గేట్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో రాత్రి మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి , మాజీ జడ్పీటీసీ దశరత్ నాయక్ వారి పార్థివ దేహానికి నివాళులు అర్పించి ,బాధిత కుటుంబాలకు 15000/- వేల రూపాయలు, రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా 10,000/- రూపాయలు అందజేశారు.ఈ కార్యక్రమంలో, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేష్, బి ఆర్ ఎస్ పార్టీ జిల్లా నాయకులు శ్రీనివాస్ రెడ్డి,సుభాష్,సైదులు, రాజశేఖర్,సుమన్ నాయక్, శ్రీనునాయక్,తదితరులు పాల్గొన్నారు.

# పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం

## ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి





**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** సమాజంలో రైతును రాజు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యయం అని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు కడ్తాల్,మరియు కల్వకుర్తి మండలం మార్చాల గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను అధికారులతో కలిసి ప్రారంభించారు. అనంతరం మార్చాల గ్రామంలో గౌడ సంఘం కమ్యూనిటీ భవనానికి 5 లక్షల రూపాయల తో భూమి పూజ చేయడం జరిగింది.వాటితో పాటు మాజీ జెడ్పి వైస్ చైర్మన్ బాలాజీ సింగ్ జడ్పీ నిధుల నుండి 5 లక్షల రూపాయలతో మట్టి రోడ్డుకు భూమి పూజ చేయడం జరిగింది. హనుమాన్ దేవాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేయడం జరిగింది. జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సూర్యలత స్పిన్నింగ్ మిల్ వారు సమకూర్చిన కంప్యూటర్లను ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ, గత ప్రభుత్వం రైతులను తేమ.ఇతర కారణాలతో అనేక ఇబ్బందులకు గురి చేయడం జరిగిందని.ఇప్పుడు అల చేయకుండా రైతుల సంక్షేమం కోసం అధికారులు.ధాన్యం కొనుగోదారులు కృషి చేయాలని కోరారు.రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సంవత్సరం సన్న ధాన్యానికి 5 వందలు ప్రతి కింటాకు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.రైతులు దళారుల మాటలు నమ్మితే మోసం జరుగుతుందని నేరుగా ధాన్యం కొనుగోలు కేంద్రాలకు. వ్యవసాయ మార్కెట్ కు తీసుకువచ్చి విక్రయాలు జరుపుకోవాలని సూచించారు. అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తూ ఎలాంటి మోసాలకు తావు లేకుండా పాటుపడాలని తెలిపారు. అనంతరం గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి నీ ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో పొల్యూషన్ బోర్డ్ కమిటీ సభ్యులు బాలాజీ సింగ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆనంద్ కుమార్, కాంగ్రెస్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్ కుమార్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు చిమ్మల శ్రీకాంత్ రెడ్డి, పిఏసిఎస్ చైర్మన్ జనార్దన్ రెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు చంద్రకాంత్ రెడ్డి, రమాకాంత్, నాని, పడకంటి వెంకటేష్, సురేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు యువకులు, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ నాయకుల ఫిర్యాదు



**అగ్నిధార న్యూస్ కామన్పూర్ :** కమాన్ పూర్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో కమాన్ పూర్ పోలీస్ స్టేషన్ లో చల్ల నారాయణరెడ్డి పూదరి సత్యనారాయణ పై కమాన్ పూర్ మండల కాంగ్రెస్ నాయకులు కమాన్ పూర్ పోలీస్ స్టేషన్లో సోమవారం ఫిర్యాదు చేశారు . చల్ల నారాయణరెడ్డి మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు శీను బాబుపై ఆధారం లేని ఆరోపణలు చేస్తూ పుట్ట మధును చంపమన్నారని మమ్మల్ని ప్రోత్సహించారని, దాడి చేయమన్నారని, నిరాధారమైన ఆరోపణలు చేస్తూ సమాజంలో గౌరవమైన స్థానంలో ఉన్న శ్రీధర్ బాబుకి శీను బాబుకి రాష్ట్రంలో దేశంలో మంథని నియోజకవర్గంలో పరువుకు భంగం కలిగించేలా కుట్రపన్ని శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా జనాలను రెచ్చగొట్టే విధంగా గొడవలకు దాడులకు కారణం అయ్యేవిధంగా వివిధ మీడియా ఛానల్లో యూట్యూబ్ ఛానల్ లో మాట్లాడిన కారణంగా చల్ల నారాయణరెడ్డి, పూదరి సత్యనారాయణపై, చట్టపరంగా చర్య తీసుకొని కేసు నమోదు చేయాలని కమాన్ పూర్ మండల ఎస్ ఐ కి ఫిర్యాదు చేశారు.

## మరిన్ని సీఎన్‌జీ మోడళ్లు

గ్రామీణ, పట్టణ విపణుల్లో సీఎన్‌జీ ఇంధనంతో నడిచే కార్లకు గిరాకీ పెరుగుతోందని హ్యుందాయ్ మోటార్ ఇండియా లిమిటెడ్ (హెచ్‌ఎంఐఎల్) పూర్తి కాల డైరెక్టర్, సీఓఓ తరుణ్ గార్గ్ వెల్లడించారు. ప్రస్తుతం తాము సీఎన్‌జీతో నడిచేలా గ్రాండ్ ఐ10 నియోస్, ఆరా, ఎక్స్‌టర్ మోడళ్లను విక్రయిస్తున్నట్లు తెలిపారు. 2021-22లో హ్యుందాయ్ దేశీయ విక్రయాల్లో సీఎన్‌జీ మోడళ్ల వాటా 9.1% కాగా, 2023-24 కల్లా 11.4 శాతానికి పెరిగిందని, ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) ఏప్రిల్-అక్టోబరులో ఈ వాటా 12.8 శాతానికి చేరిందన్నారు.

# బీఆర్ఎస్ నాయకులు పిర్యాదు



**అగ్నిధార న్యూస్ కమాన్ పూర్ :** మంథని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ మంథని నియోజకవర్గం ఇంచార్జి పుట్ట మధు పై జరిగిన హత్య కుట్ర పై సుమోటోగా కేసు నమోదు చేయాలని బీఆర్ఎస్ మండల పార్టీ ఆధ్వర్యంలో సోమవారం కమాన్ పూర్ పోలీసు స్టేషన్ లో పిర్యాదు చేశారు. చల్లా నారాయణ రెడ్డి 2014 కు ముందు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మంత్రిగా కొనసాగుతున్న శ్రీధర్ బాబు, సోదరుడు శ్రీను బాబుల ఆదేశాల మేరకు పుట్ట మధు పై దాడి చేసేందుకు వెళుతున్న తరుణంలో యాక్సిడెంట్ కావడంతో తనకు జ్ఞానోదయమై విరమించుకున్నామని అప్పటి శ్రీధర్ బాబు అనుచరుడు చల్లా నారాయణ రెడ్డి చేసిన వ్యాఖ్యల పై సుమోటో గా కేసు నమోదు చేసి సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. పోలీసులకు పిర్యాదు చేసిన వారిలో బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షులు తాటికొండ శంకర్, యూత్ మండల అధ్యక్షులు బొమ్మగాని అనిల్ గౌడ్, మాజీ సర్పంచ్ లు కొండ వెంకటేష్, ఆకుల గట్టయ్య, ఏ.ఎం.సి మాజీ వైస్ చైర్మన్ గుర్రం లక్ష్మిమల్లు, మాజీ ఉప సర్పంచ్ పోలుదాసరి సాయికుమార్, నాయకులు బొల్లపెల్లి శంకర్ గౌడ్, దండే కిషన్, ఎలాబోయిన రామ్మూర్తి, తోట రాజ్ కుమార్ లు ఉన్నారు.

# అసత్యపు ఆరోపణలు మానుకోవాలి..!



**అగ్నిధార న్యూస్ కమాన్ పూర్ :** కాంగ్రెస్ ప్రభుత్వం పై అసత్యపు ఆరోపణలు చేయడం బీ. ఆర్. ఎస్ నాయకులు పుట్ట మధు మానుకోవాలని లేని యెడల సహించేది లేదని కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు. కమాన్ పూర్ మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద గల అంబేద్కర్ విగ్రహం ముందు సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను ఆచరణలో అమలు చేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టిందన్నారు. మహిళలకు ఆర్టీసీ బస్సు ఉచిత సౌకర్యం కల్పించింది కనబడటం లేదా ? గ్యాస్ సబ్సిడీ ఖాతాల్లో జమ అవుతున్నది తెలియడం లేదా..? రైతు రుణ మాఫీ చేసింది చూడలేదా ..? గారడి మాటలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని, రాజకీయ లబ్ధి కోసం చేస్తున్న ఆరోపణలను ఇకనైనా మానుకుని బాధ్యతయుతమైన ప్రతిపక్షంగా ఇప్పటికైనా వ్యవహారించాలని హితువు పలికారు. మంత్రి శ్రీధర్ బాబు పై మరోమారు అసత్యపు ఆరోపణలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ విలేకర్ల సమావేశంలో కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి మల్యాల తిరుపతి, జిల్లా కార్యదర్శి సయ్యద్ సయిద్ అన్వర్, రంగు సత్యనారాయణ గౌడ్, ఎం. డి ఇంతియాజ్, శేవ్వ శంకరయ్య, భూంపెల్లి రాజయ్య, దాసరి గట్టయ్య, ఆడెపు రమేష్, ఎం. ఏ రఫీక్, గడప కృష్ణమూర్తి, పిల్లి శేఖర్, ఎం. డి ముస్తాక్, అనవేన లక్ష్మి రాజం, మల్యాల మహేష్, మొహమ్మద్ యూసుఫ్ లల్లూ, బోనాల సత్యం, జంగపెల్లి చిన్న శ్రీనివాస్, నక్క శంకర్, నీల రాజయ్య, కాస రవి, ముత్యం తిరుపతిలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుండి ఆమనగల్ పట్టణ కేంద్రంలో ఉచిత కంటి వైద్య శిబిరం




## టాస్క్ సి ఓ ఓ, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** నేటి నుండి అనగాఈనెల(నవంబర్)19 మంగళవారం నుండి 27 బుధవారం వరకు.ప్రతి రోజు ఉదయం 09:00 గం. నుండిమధ్యాహ్నం 01:00 వరకు స్థలం ఆమనగల్ శ్రీ లక్ష్మీ ఫంక్షన్ హాల్, ఆమనగల్కల్వకుర్తి రోడ్ ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో,కల్వకుర్తి నియోజకవర్గ ప్రాంత ప్రజల కోసంఐక్యత ఫౌండేషన్ చైర్మన్టాస్క్ సి ఓ ఓసుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ప్రముఖ కంటి వైద్య నిపుణులు శంకర నెత్రాలయ వారిచే ఏర్పాటు చేస్తున్న ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని నియోజకవర్గ ప్రాంత ప్రజలు అందరూ సద్వినియోగం చేసుకోవాలని మనవి చేస్తూ, ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలతో పాటు,కంటి శుక్లాలు సర్జరీ చేయబడునుఆధార్ కార్డు జిరాక్స్ తప్పనిసరిగా తుకొని రాగలరు.

# మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

## చారి ట్రబుల్ ఛైర్మన్ ఉప్పల వెంకటేష్

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి):** తలకొండపల్లి మండల%శీ% పడకల్ గ్రామానికి చెందిన కలకొండ రంగమ్మ అనారోగ్యం తో మరణించడం జరిగింది. విషయాన్ని గ్రామ బి ఆర్ ఎస్ పార్టీ నాయకుల ద్వారా తెలుసుకున్న తలకొండపల్లి మండల మాజీ జడ్పీటీసీ బి ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ 3000 రూపాయలు మృతుని కుటుంబానికి గ్రామ బి ఆర్ ఎస్ పార్టీ నాయకుల ద్వారా అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో, బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు లట్టుపల్లి శ్రీనివాస్ రెడ్డి , జల్లాల రమేష్, మాజీ వార్డు మెంబర్ అత్తన పాండు , చౌటి విజయ్ కుమార్, చెన్నయ్య, పర్వతల్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

# మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

## మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్ రెడ్డి

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** తలకొండపల్లి మండలం పడకల్ గ్రామానికి చెందిన కలకొండ రంగమ్మ వయసు 90 సంవత్సరాలు అనారోగ్యంతో భాద పడుతు నిన్న రాత్రి మరణించడం జరిగింది. విషయం గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు ద్వారా తెలుసుకున్న మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డోకూరి ప్రభాకర్ రెడ్డి 3000 రూపాయలు గ్రామ అధ్యక్షులు మాజీ ఉపసర్పంచ్ జల్లెల శ్రీశైలం యాదవ్ 3000 రూపాయలు ,మొత్తం 6000 రూపాయలు మృతుని కుటుంబానికి అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో, ఎంపీటీసీల ఫోరం మాజీ మండల అధ్యక్షులు జోగు రమేష్ , బురిగళ్ళ నరసింహ, జోగు రామచంద్రయ్య, ఎండి గౌస్ ,జె విజయ్ కుమార్, కోనాపురం ,గణేష్, బూరెల యాదయ్య, గూడ మహేష్, బురిగళ్ళ కరుణాకర్, తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమం - అభివృద్ధియే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం..!

## - ప్రభుత్వం పై అర్ద రహిత విమర్శలు మానుకోవాలి

**అగ్నిధార న్యూస్ కమాన్ పూర్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమం - అభివృద్ధియే ధ్యేయంగా పని చేస్తుందని రాజకీయ ప్రయోజనాల కోసం బీ. ఆర్. ఎస్ పార్టీ నాయకులు అర్ద రహిత విమర్శలు చేయడం మానుకోవాలని కాంగ్రెస్ నాయకులు హితువు పలికారు. కమాన్ పూర్ మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. మంథని నియోజకవర్గ సమగ్ర అభివృద్దే ధ్యేయంగా అహర్నిషలు కృషి చేస్తున్న శ్రీధర్ బాబుకు మంథని నియోజకవర్గం ప్రజలు వరుసగా ఎమ్మెల్యేగా గెలిపిస్తూ పట్టం కట్టడమే ఇందుకు నిలువెత్తు నిదర్శనమన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక 2014 లో ఒక్కసారి ఉద్యమ పార్టీ అప్పటి టీ. ఆర్. ఎస్ పార్టీ అభ్యర్థికి ఒక్కసారి ఇక్కడి ప్రజలు అవకాశం కల్పించారే తప్ప శ్రీధర్ బాబు పై వ్యతిరేకతతో కాదని బీ. ఆర్. ఎస్ నేత పుట్ట మధు గుర్తేరగాలని సూచించారు. బీజేపీ నాయకులు చల్లా నారాయణ రెడ్డి నిరందరమైన ఆరోపణలు చేయడం సిగ్గు చేటన్నారు. రాజకీయ ఉనికి కోసమే మంత్రి శ్రీధర్ బాబు పై అసత్యపు ఆరోపణలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ వస్తుందన్నారు. కళ్ళు ఉన్న చూడలేని కాబోదులుగా ప్రతిపక్ష పార్టీల నాయకులు మారారన్నారు. కాంగ్రెస్ పార్టీ బిక్షతోనే పుట్ట మధు, చల్లా నారాయణ రెడ్డి లకు రాజకీయ పదవులు వచ్చాయన్నారు. మంత్రి శ్రీధర్ బాబు పై కాంగ్రెస్ ప్రభుత్వం పై అర్ద రహిత విమర్శలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ విలేకర్ల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వైనాల రాజు, పీ. ఏ. సీ. ఎస్ చైర్మన్ ఇనగంటి భాస్కర్ రావు, మాజీ ఎంపిపి కోలేటి మారుతి, నాయకులు చొప్పరి శేఖర్, కుక్క రవీందర్, బాద్రపు శంకర్, తొగరి అశోక్ లతో పాటు తదితరులు పాల్గొన్నారు.



**పుట్ట మధు దిష్టిబొమ్మ దగ్ధం..!**

కమాన్ పూర్ మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ముందు సోమవారం బీ. ఆర్. ఎస్ నేత పుట్ట మధు, బీజేపీ నేత చల్లా నారాయణ రెడ్డి లకు వ్యతిరేఖంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు నినాదాలు చేశారు. అనంతరం పుట్ట మధు దిష్టిబొమ్మను దగ్ధం చేశారు.

# అప్పుల పాలయ్యాము బిల్లులు చెల్లించండి..!

**అగ్నిధార న్యూస్ కమాన్ పూర్ :** తాము సర్పంచ్ లుగా కొనసాగి అప్పుల పాలయ్యామని తమకు రావలసిన బిల్లులు చెల్లించాలని సిద్దిపల్లె తాజా మాజీ సర్పంచ్ తాటికొండ శంకర్, పెంచికల్ పేట్ తాజా మాజీ సర్పంచ్ కొండ వెంకటేష్ లు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. కమాన్ పూర్ ప్రెస్ క్లబ్ లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 2019లో సర్పంచులుగా ప్రమాణ స్వీకారం చేశామని మొదటి 8 నెలలు చెక్ పవర్ లేనందున పనులకు బిల్లులు రాకుండా అప్పుల పాలయ్యామని పేర్కొన్నారు. అభివృద్ధి కోసం గ్రామాలకు పెట్టు బడి పెట్టామని ఇప్పటివరకు రాక అవస్థల పాలయ్యామని అన్నారు. అలాగే చాలా గ్రామాల్లో ఉపసర్పంచులతో సఖ్యత లేక పెండింగ్ బిల్లులు తీసుకోలేదని వాపోయారు. 2021 కరోనా మహమ్మారి వ్యాధితో కొంత మంది ప్రాణాలు వదలడం జరిగిందన్నారు. కరోనా సమయంలో చనిపోయిన వారి అంత్యక్రియలు కూడా చేయడం జరిగిందని పేర్కొన్నారు. అలాగే అధికారుల ఒత్తిడితో పల్లె ప్రగతి, వైకుంఠధామాలు, డంపింగ్ యార్డులు, ప్రకృతి వనాలు నిర్మించడం జరిగిందని ఇప్పటివరకు చాలా వరకు బిల్లులు రావాల్సి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక సర్పంచ్ల పదవీకాలం పొడిగింపు చేసి బిల్లులు చెల్లింపు చేస్తారు అని హామీ ఇచ్చి ఇప్పుడు ఎటువంటి బిల్లులు చెల్లింపు చేయలేదని వాపోయారు. ఈ నెల 20న ముఖ్యమంత్రి వేములవాడ వస్తున్న సందర్భంగా వినతి పత్రం అందజేయడం జరుగుతుందని వారు తెలిపారు.

## ప్రజావాణి దరఖాస్తులను సత్వరం పరిష్కరించండి

కలెక్టర్ పమేలా సత్పతి

**కరీంనగర్ :** ప్రజావాణిలో స్వీకరించే దరఖాస్తులను పెండింగ్ లో ఉంచకుండా సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని ఆడిటోరియంలో ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్ రెవె న్యూ, తో కలిసి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ. సీఎం ప్రజా దర్బార్ లాగిన్ లో ఉన్న అన్ని దరఖాస్తులను వచ్చేనెల ఒకటికల్లా పరిష్కరించాలని మండలాల అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా మైనారిటీ అధికారి పవన్ కుమార్, ఏవో సుధాకర్ రెడ్డి, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో వచ్చిన పిర్యాదులకు వెంటనే పరిష్కారం చూపాలి

**సిద్దిపేట :** ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే సమస్యలకు అధిక ప్రాధాన్యతనిస్తూ వచ్చిన ఫిర్యాదులకు సత్వరమే పరిష్కార మార్గం చూపాలని జిల్లా కలెక్టర్ ఎం. మను చౌదరి సంబంధిత అధికారులను ఆదేశించారు.. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ తో కలిసి జిల్లా కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ. సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజలు ఎన్నో వ్యయప్రయాలకు ఓర్చి వస్తారని, అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ. సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కాగా ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 48 ఫిర్యాదులు, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే జిల్లా అధికారులు ప్రజావాణి కి విధిగా హాజరుకావాలని అనుమతి లేనిదే గైర్హాజరు అయితే కఠిన చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ నాగ రాజమ్మ, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సచివాలయంలో వాస్తు మార్పులు


**హైదరాబాద్ :** తెలంగాణ సచివాలయంలో మార్పులు జరుగుతున్నాయి. తూర్పు వైపు ఉన్న ప్రధాన ద్వారాన్ని (బాహుబలి గేటు) మూసేస్తున్నారు. ఇందులో భాగంగా తలుపులు తీసేసి ఆ ప్రాంతంలో రేకులను ఏర్పాటు చేశారు. ఈశాన్యం గేటుకు తూర్పు వైపుకు ప్రధాన ద్వారం రానుంది. ఇక్కడ మరో గేటును ఏర్పాటు చేయనున్నారు. మిగతా గేట్లను యథావిధిగా ఉంచనున్నారు. డిసెంబర్ 9న తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ ఉండటంతో ఆ లోపు వాస్తు మార్పులు పూర్తి చేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.దాదాపు రూ.3.20 కోట్లతో ప్రభుత్వం ఈ మార్పులు చేస్తోంది. సచివాలయానికి ప్రస్తుతం నాలుగు వైపుల ప్రధాన గేట్లు ఉన్నాయి. తూర్పు వైపు లుంబినీ పార్క్ ఎదురుగా ఉన్న బాహుబలి గేటు నుంచి మాజీ సీఎం కేసీఆర్ రాకపోకలు జరిపేవారు. ఆ గేటు నుంచి సచివాలయం లోపల ప్రధాన ద్వారం వరకు రాకపోకలను కొంతకాలం నిలిపేశారు. ఆ దారిలోనే తెలంగాణ తల్లి విగ్రహంతో పాటు చుట్టూ లాన్, ఫౌంటెయిన్లు ఏర్పాటు చేస్తున్నారు. నైరుతి, ఈశాన్య గేట్లను కలుపుతూ రోడ్డును కూడా వేస్తున్నారు.పశ్చిమం వైపు మింట్ కాంపౌండ్ ఉంది. ఈ ద్వారాన్ని ఎక్కువగా ఉపయోగించడం లేదు. ఇక్కడ ఎలాంటి మార్పులూ చేయడం లేదు. సచివాలయం నిర్మాణం తర్వాత మార్పులు చేయడం ఇదే తొలిసారి. కొత్త సచివాలయ భవనాన్ని నాటి సీఎం కేసీఆర్ గత ఏడాది ఏప్రిల్ నెలలో ప్రారంభించారు

## అప్పుల తెలంగాణగా మార్చేస్తున్నారు



**హైదరాబాద్ :** ఆర్ఎస్ హయాంలో కేసీఆర్ రూ.7 లక్షల కోట్ల అప్పులు చేస్తే... రేవంత్ రెడ్డి అప్పుల కోసం ఏకంగా ఒక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేశారని బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు కిషన్ రెడ్డి మండిపడ్డారు. బీఆర్ఎస్ దారిలోనే కాంగ్రెస్ ప్రభుత్వం నడుస్తోందని విమర్శించారుఈరోజు ఆయన మీడియాతో మాట్లాడుతూ... బీఆర్ఎస్ హయాంలో ఎలాగైతే అవినీతి జరిగిందో, ఇప్పుడు అదే కనిపిస్తోందని, అప్పుడు ఎలాగైతే గాలిమాటలు చెప్పారో ఇప్పుడూ అలాగే చెబుతున్నారన్నారు. వీటితో ప్రజలు విసిగిపోతున్నారని తెలిపారు.కేసీఆర్, రేవంత్ రెడ్డి రాజకీయాల్లో నైతిక విలువలు వదిలేశారన్నారు. రాష్ట్రాన్ని పూర్తిగా భ్రష్టు పట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇచ్చిన ఏ హామీని అమలు చేయడం లేదన్నారు. రేవంత్ రెడ్డి వ్యక్తిగత విమర్శలకు దిగడం దారుణమని వ్యాఖ్యానించారు.కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు తమ వైఫల్యాన్ని కప్పిపు చ్చుకునే ప్రయత్నాలు చేస్తున్నాయన్నారు. బీజేపీ నిర్మాణాత్మక రాజకీయాలే చేస్తోంద న్నారు. తెలంగాణలో పని చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదన్నారు. దేశంలో కాంగ్రెస్ పార్టీ మూడు రాష్ట్రాల్లో అధికారంలో ఉండి భ్రష్టు పట్టించిందన్నారు.

## వేములవాడ రాజన్న ఆలయానికి 127.65 కోట్లు



**హైదరాబాద్ :** వేములవాడ రాజరాజేశ్వర ఆలయ అభివృద్ధి పనుల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.127.65 కోట్లు మంజూరు చేసింది. శ్రీ రాజరాజేశ్వర ఆలయ కాంప్లెక్స్ విస్తరణ, భక్తులకు అవసరమైన అధునాతన సదుపాయాలకు రూ.76 కోట్లు కేటాయించారు. ఆలయం నుండి మూలవాగు బ్రిడ్జి వరకు రోడ్ల విస్తరణకు రూ.47.85 కోట్లు కేటాయించారు. మూలవాగులోని బతుకమ్మ తెప్ప నుండి జగిత్యాల కమాన్ జంక్షన్ వరకు డ్రైనేజీ పైప్ లైన్ నిర్మాణానికి రూ.3.8 కోట్లు కేటాయించారు.ఇదిలా ఉంటే తెలంగాణలోనే అతిపెద్ద పుణ్యక్షేత్రంగా వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి పేరు ఉంది. ఈ ఆలయం ఎంతో పురాతనమైనది కాగా వేల సంఖ్యలో భక్తులు వచ్చి దర్శించుకుంటారు. సోమవారం రోజు భక్తుల సంఖ్య మరింత ఎక్కువగా ఉంటుంది. రాష్ట్రంలోనే అతిపెద్ద మరియు పురాతన ఆలయం అయినప్పటికీ ఉమ్మడి పాలనలో ఈ ఆలయం అభివృద్ధికి నోచుకోలేదు. ప్రత్యేక రాష్ట్రంలో ఆలయాన్ని అభివృద్ధి చేస్తారని అంతా భావించారు.కానీ ప్రత్యేక రాష్ట్రంలోనూ ఆలయ అభివృద్ధిపై గత ప్రభుత్వం దృష్టి పెట్టలేదు. దీంతో కాంగ్రెస్ ఎన్నికల సమయంలో వేములవాడ ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చింది. ఈ నేపథ్యంలోనే ఇచ్చిన మాట ప్రకారం ఆలయ అభివృద్ధి కోసం నిధులు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మరోవైపు ఈ నెల 20న సీఎం రేవంత్ రెడ్డి వేములవాడలో పర్యటించనున్నారు. స్వామివారిని దర్శించుకోవడంతో పాటూ వేములవాడ సభలో గల్ఫ్ బాధిత కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా పంపిణీ చేయనున్నారు

# ప్రశాంతంగా ముగిసిన గ్రూప్-3 పరీక్షలు

### జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష. రెండవ రోజు 4514 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



**అగ్నిధారన్యూస్,పెద్దపల్లి, నవంబర్ -18:-** జిల్లాలో గ్రూప్ 3 పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.సోమవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సుల్తానాబాద్ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలలో జరుగుతున్న గ్రూప్ 3 పరీక్షలను తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, పెద్దపెల్లి జిల్లాలో మొత్తం 8 వేల 947 మంది అభ్యర్థులకు 18 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా ఆదివారం ఉదయం జరిగిన మొదటి పేపర్ పరీక్షకు 4557 మంది అభ్యర్థులు హాజరు కాగా, 4390 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారని, మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 4440 మంది అభ్యర్థులు హాజరు కాగా, 4507 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారని, సోమవారం ఉదయం మూడో పేపరు పరీక్షకు 4514 మంది అభ్యర్థులు హాజరు కాగా, 4433 మంది అభ్యర్థులు గైరహాజరయ్యారని , జిల్లాలో గ్రూప్ 3 పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని కలెక్టర్ తెలిపారు.

ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# రాజుర ఎన్నికల ప్రచారంలో మంత్రి సీతక్కతో కలిసి ఎన్నికల ప్రచారంలో మంత్రి పొన్నం ప్రభాకర్



**హైదరాబాద్ :** నేను సోదరీ మంత్రి సీతక్క చెబుతున్నాం రాహుల్ గాంధీ చెప్పినట్లుగా ఈ దేశంలో ఎవరు అడ్డుపడినా కుల గణన జరిగి తీరుతుందని మంత్రి పొ?న్నం ప్రభాకర్ అన్నారు.. గడ్కరి, నరేంద్ర మోడీ ఎవరు ఆపలేరు. రేవంత్ రెడ్డి నేతృత్వంలో తెలంగాణ ప్రభుత్వం కుల గణన అంశంపై దేశానికి దిశా దశగా నిలుస్తోంది. కులగణన పై క్యాబినెట్ లో తీర్మానం చేశాం. అసెంబ్లీలో తీర్మానం చేశానీ. ప్లానింగ్ శాఖ ద్వారా కుల గణన విజయవంతంగా నిర్వహిస్తున్ననీ. ఇప్పటికీ 50 శాతానికి పైగా సర్వే పూర్తయింది. ప్రజలే ముందుకు వచ్చి సర్వేలో తమ వివరాలు నమోదు చేయించుకుం టున్నారు. ఎన్యుమరేటెర్స్ ను ఇంటికి ఆహ్వానించి మరీ వివరాలు ఇస్తున్నారు. ప్రజలంతా సహకరిస్తుంటే కొంతమంది తప్పుడు ప్రచారం చేస్తున్నారు. మహారాష్ట్ర ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు బిజెపి, బిఆర్ఎస్ వాళ్లు దుష్ప్రచారం చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ దేశాన్ని ఐక్యం చేసే పార్టీ. దేశ ప్రజలను ఐక్యంగా ఉంచేందుకు తన త్యాగాలు చేసిన చరిత్ర కాంగ్రెస్ ది. స్వతంత్ర పోరాటంలో స్వతంత్ర భారతదేశంలో త్యాగాలు చేసింది కాంగ్రెస్ నేతలే. రాజుర నియోజకవర్గంలో కాంగ్రెస్ ఘన విజయం సాధిస్తుంది. మహారాష్ట్రలో కాంగ్రెస్ కూటమి గెలుస్తోంది. రాహుల్ గాంధీ ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం మహారాష్ట్రలోనూ కాంగ్రెస్ కూటమి కుల గణన చేపడుతోంది. జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్లు సంక్షేమ ఫలాలు అందిస్తాం. అందుకు తెలంగాణ ప్రభుత్వం సహకారం అందజేస్తుంది. బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా అసెంబ్లీలో నేను ప్రతిపాదిస్తే సభ ఏకగ్రీవంగా కులదరణ తీర్మానాన్ని ఆమోదించింది. 1.17 కోట్ల కుటుంబాల వివరాలను 87 వేల ఏన్యుమరేటర్లు సేకరిస్తున్నారు. ఒక్కో ఎన్ని మారేటర్ 150 ఇండ్ల వివరాలను సేకరిస్తున్నారు. కుల గణన చేపట్టే వారిని తన్ని తరిమేయాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్గారి అహంకారంతో మాట్లాడుతున్నారు. ప్రజలు ఎవరిని తల్లి తరిమేస్తారో మహారాష్ట్ర ఎన్నికల్లో తేలిపోతుంది. తెలంగాణలో కుల గణన మొదలుపెడితే మోడీ ప్రభుత్వం వణికి పోతుంది. కుల గణన ప్రజలను చీల్చడానికి కాదు. వాటాగా సంక్షేమ ఫలాలు రిజర్వేషన్లు దక్కని వర్గాల కోసమే ఈ సర్వే. రాహుల్ గాంధీ ఆలోచన మేరకు ఈ సర్వే చేస్తున్నాం. కుల గణన లతో వనికిపోయిన బిజెపి నేతలు సుప్రీంకోర్టులో పిటిషన్ కూడా దాఖలు చేశారు. ఆర్ఎస్ఎస్ వాళ్లు కులగలను వ్యతిరేకిస్తూ ఎన్నో ప్రసంగాలు చేశారు. సామాజిక న్యాయాన్ని కాంక్షించే బిజెపి నేతలు బయటకు రండి. మేమెంతో మాకు అంత నిజం చేసుకోవడానికి బిజెపి నాయకత్వాన్ని ప్రశ్నించండి. హిందూ ముస్లింల పేరుతో ప్రజలను చీల్చి బిజెపి రాజకీయాలు చేస్తుంది.

# లగచర్ల బాధితులను కలిసిన జాతీయ ఎస్టీ కమిషన్

**మహబూబ్ నగర్ :** సంగారెడ్డి జైలులో లగచర్ల రైతులతో బీజేపీ ఎంపీలు ఈటల రాజేందర్, డీకే అరుణ మాట్లాడారు. రైతులను పరామర్శించారు. ఫార్మా కంపెనీకి భూములు ఇవ్వబోమంటూ.. ఎనిమిది నెలలుగా రైతులు ఆందోళన చేస్తున్నారని ఎంపీలు వ్యాఖ్యానించారు. బలవంతంగా భూములు లాక్కుంటామంటేనే రైతులు ఆగ్రహించారని చెప్పారు.'లగచర్ల ఘటనకు పోలీసుల వైఫల్యమే కారణం. ఘటనలో కాంగ్రెస్‌కు చెందినవారిని వదిలేశారు. లగచర్ల బాధితులను వెంటనే విడుదల చేయాలి. రేవంత్‌కు ప్రజల కంటే ఫార్మా కంపెనీ ముఖ్యమా. రేవంత్ కొడంగల్ వాసి కాదు.. వలస వచ్చారు. కాంగ్రెస్ వాళ్లే ఈ దాడులు చేయించారు. ఈ ఘటనపై పార్లమెంట్‌లో ప్రివిలేజ్ మోషన్ వేస్తాం. బడా కంపెనీలకు భూములు అప్పజెప్పడం వెనుక మతలబేంటి.. రియల్ఎస్టేట్ కోసం భూములు ఇస్తే ఊరుకోం' అని బీజేపీ ఎంపీలు స్పష్టం చేశారు.అటు లగచర్ల ఫార్మా బాధితులు ఢిల్లీకి వెళ్లారు. జాతీయ మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. మానవ హక్కుల సంఘానికి, ఎస్సీ కమిషన్‌కు, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. వీరివెంట మాజీమంత్రి సత్యవతి రాథోడ్ ఉన్నారు. లగచర్ల ఫార్మా బాధితులకు న్యాయం చేయాలని బీఆర్ఎస్ నాయకులు మహిళా కమిషన్‌ను కోరారు.కాంగ్రెస్, బీజేపీపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. 'బీఆర్ఎస్ పాలన ఎలా ఉందో కాంగ్రెస్ పాలన కూడా అలాగే ఉంది. ఏ మాత్రం మార్పు రాలేదని ప్రజలు బాధపడుతున్నారు. ప్రజా సమస్యలపై చర్చ జరగదు. వ్యక్తులను విమర్శించడమే రాజకీయంగా మారిపోయింది. ఈ రెండు పార్టీల వల్ల రాజకీయాలు పూర్తిగా దిగజారిపోయాయి. బీఆర్ఎస్ సుద్దపూ స అయినట్టు ఇప్పుడు మాట్లాడుతోంది' అని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వ్యాఖ్యానించారు.మరోవైపు లగచర్ల దాడి ఘటనపై దర్యాప్తు కొనసాగుతుంది. ప్రస్తుతం లగచర్ల, రోటిబండ, పులిచర్లకుంటలో సాధారణ పరిస్థితులు ఉన్నాయని పోలీసులు చెబుతున్నారు. ఈ కేసులో కీలక నిందితుడు సురేష్ ఇంకా పరారీలోనే ఉన్నట్టు తెలుస్తోంది. సురేష్ ఆచూకీ కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.ప్రభుత్వం తమ వారిపై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపిందని.. బాధిత రైతు, గిరిజన కుటుంబాల సభ్యులు ఆరోపించారు. రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్యను ఇటీవల కలిసి ఫిర్యాదు చేశారు. మణిపూర్‌లో మహిళలపై దాడి జరిగితే రాహుల్ గాంధీ వెళ్లి పరామర్శించి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారని, లగచర్లకు కూడా ఆయన రావాలని డిమాండ్ చేశారు.

### అల్లుడి కోసం అరాచకమా

శాంతి భద్రతల వైఫల్యం వల్లే వికారాబాద్ జిల్లాలో లగచర్ల ఘటన జరిగిందని బిజెపి ఎంపి డీకే అరుణ అన్నారు. లగచర్ల కంపెనీకి భూసేకరణ కోసం రైతులు నిరాకరించారని ఆమె చెప్పారు. వికారాబాద్ కలెక్టర్‌పై దాడి కేసులో అరెస్టు అయి సంగారెడ్డి సెంట్రల్ జైలులో ఉన్న 16 మందితో బిజెపి ఎంపి ఈటల రాజేందర్ తో కలిసి డీకే అరుణ ములాఖత్ అయ్యారు.అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. ఫార్మా కంపెనీ వద్దని గత 8 నెలలుగా రైతులు దీక్షలు చేస్తున్నారని.. కానీ, రైతుల నుంచి బలవంతంగా భూములు లాక్కోవడానికి యత్నించారని ఎంపీ ఆరోపించారు. ప్రభుత్వం చేపట్టిన ప్రజావేదికను గ్రామస్థులు బహిష్కరించారని తెలిపారు. లగచర్ల ఘటన తెలంగాణ రాజకీయాల్లో ప్రకంపనలు పుట్టిస్తోంది. తాజాగా ఈ అంశంపై డీకే అరుణ మాట్లాడుతూ, లగచర్ల గ్రామంలో ఫార్మా కంపెనీకి భూములు ఇవ్వబోమని గత 8 నెలలుగా గ్రామస్తులు ఆందోళన చేస్తున్నారని అన్నారు. బలవంతంగా భూములు లాక్కుంటామని అధికారులు చెప్పడంతో రైతులు ఆగ్రహానికి గురయ్యారని, ప్రజాభిప్రాయ సేకరణను బహిష్కరించారని చెప్పారు. రేవంత్ రెడ్డి సోదరుడు అక్కడున్న రైతులను భయపెట్టారని, ఎలాగైనా భూములను గుంజుకుంటామని చెప్పారని మండిపడ్డారు. కలెక్టర్ పై దాడి ఘటన తర్వాత గ్రామాల్లోకి వచ్చిన పోలీసులు ఇష్టం వచ్చినట్టు దాడి చేశారని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిది కొడంగల్ కాదని... వారు వలస వచ్చారని డీకే అరుణ చెప్పారు. రేవంత్ రెడ్డి సీఎం అయితే తమ నియోజకవర్గం బాగుంటుందని ప్రజలు గెలిపిస్తే... ఆయనేమో జనాలపై కక్ష కట్టాని దుయ్యబట్టారు. లగచర్ల బాధితులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో పోలీసులకు సమాచారం లేకుండా కలెక్టర్ ఒక్కరే గ్రామానికి వెళ్లారని.. అక్కడికి వచ్చిన కలెక్టర్‌ను గో బ్యాక్ అని ప్రజలు నిరసన తెలిపారని చెప్పారు. ఈ క్రమంలోనే ఘటన చోటుచేసుకుందని ఎంపీ డీకే అరుణ అన్నారు. పేదల ఉసురు పోసుకున్న కేసీఆర్ ఇంటికి పోయారని... 11 నెలల సమయంలోనే మీరు పేదల ఉసురు పోసుకుంటున్నారని అన్నారు. రేవంత్ రెడ్డి అహంకారాన్ని వీడాలని చెప్పారు.

Printed Published Edited and Owned by Chegonda Ravikumar Yadav.Printed at Sri Laxmi Printing Press H.NO.4_6_157 Peddapalli Pin co.505172 State Telangana
TITLE CODE:TELTEL02040 EDITOR: Chegonda Ravikumar Yadav Contact Number.8008817828. Email.agnidharanews@gmail.com http://www.agnidharanews.com